మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
PRGI REGD NO: TGTEL/25/A1385
Circulated to Telangana
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం
WEDNESDAY
19-8-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు: 12 PAGES:12 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 51 Issue: 51

శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:35 తిథి సప్తమి రా. 7:22 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం స్వాతి ఉ. 6:41 వరకు తరువాత విశాఖ యోగం బ్రహ్మ తె. 3:350 వరకు కరణం గరజి ఉ. 6:31 వరకు వనిజ రా. 7:22 వరకు వర్జ్యం మ. 12:55 నుండి మ. 2:40 వరకు దుర్ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:44 వరకు రాహుకాలం మ. 12:19 నుండి మ. 1:53 వరకు యమగండం ఉ. 7:37 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:45 నుండి మ. 12:19 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు రా. 11:27 నుండి రా. 1:13 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున



చెరువు ఆక్రమణ అయితే చర్య తప్పదు..
ప్రభుత్వ భూమి అయితే రక్షణ తప్పదు..
22-ఏ నిషేధం చట్టబద్ధమైతే అమలు తప్పదు..
కానీ..
తప్పు రికార్డు వల్ల సామాన్యుడిని భూమి నిషేధిత జాబితాలో పడితే?
తప్పు వర్గీకరణ వల్ల రిజిస్ట్రేషన్ ఆగిపోతే?
ఏళ్ల తరబడి కేసులు నడిస్తే?
తన భూమి తనదేనని నిరూపించుకోవడానికి ఆఫీసులు, కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తే..?

చెరువుల పరిరక్షణ పేరుతో హైడ్రా బుల్డోజర్లు.. భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో 22-ఏ నిషేధాలు.. మధ్యతరగతి జీవితకాల పొదుపుతో కొనుగోలు చేసిన ఇల్లు, స్థలం ఒక్కసారిగా వివాదాస్పదంగా మారితే పరిస్థితి ఏమిటి? చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం ప్రజలకు రక్షణగా నిలవాలా? లేక తమ ఆస్తిపై హక్కును నిరూపించుకునే బాధ్యతను ప్రజల నెత్తినే వేయాలా? తెలంగాణలో భూముల చుట్టూ పెరుగుతున్న పరిణామాలు ఇప్పుడు ఈ ప్రశ్నను లేవనెత్తుతున్నాయి.



# సర్కారే... బ్లాక్‌మెయిలర్?

## భూమి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

### హైడ్రా దూకుడు.. 22-ఏ నిషేధం.. చట్టం పేరుతో మధ్యతరగతికి చుక్కలు



(ఈవార్తలు - స్పెషల్ బ్యూరో)

హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ ఆస్తులు, నాలాలు, ఆక్రమణలపై హైడ్రా చేపట్టిన చర్యలు ఒకవైపు చర్చనీయాంశంగా మారగా.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితా సామాన్యుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఆక్రమణలు తొలగించడం, ప్రభుత్వ భూములను రక్షించడం, చెరువుల ఎఫ్‌టీఎల్-బఫర్ జోన్లను కాపాడటం ప్రభుత్వ బాధ్యతే. కానీ అదే సమయంలో చట్టబద్ధంగా భూములు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్న లేదా జీవిత పొదుపుతో స్థలాలు కొనుగోలు చేసిన మధ్యతరగతి తరువాయి 2 వ పేజీలో...

## 22A అంటే ఏమిటి?

22-ఏ అనేది ఈ భూమి ప్రభుత్వానిదే అనే ముద్ర కాదు. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద కొన్ని వర్గాల ఆస్తులకు సంబంధించిన పత్రాల రిజిస్ట్రేషన్‌ను నిషేధించవచ్చు. ప్రభుత్వ భూములు, చట్టపరంగా బదలాయింపు నిషేధిత ఆస్తులు, కొన్ని దేవాదాయ/వక్ఫ్ ఆస్తులు, ఇతర చట్టపరమైన పరిమితుల్లోకి వచ్చే భూములు ఇందులో ఉండవచ్చు. అందువల్ల 22-ఏ జాబితాలో పేరు కనిపించినంత మాత్రాన యాజమాన్య వివాదం పూర్తిగా ముగిసిపోయిందని చెప్పలేం. సంబంధిత భూమి ఏ కారణంతో నిషేధిత జాబితాలో చేర్చబడిందో ముందుగా తెలుసుకోవాలి.

## 22-ఏలో భూమి ఉంటే ఏం చేయాలి?

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి పోర్టల్‌లో "ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ లిస్ట్‌లో చేర్చడంపై ఫిర్యాదు" అనే ప్రత్యేక సేవ ఉంది. సాధారణంగా సంబంధిత భూమి వివరాలు, హక్కును చూపించే పత్రాలు, రికార్డులు తదితరాలను సమర్పించి తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. భూ భారతి అధికారిక సమాచారం ప్రకారం, సర్వే నంబర్‌ను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ ప్రక్రియ ఉంది.






బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,589 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,367 |

# ప్రైవేట్ భూములు తాకొద్దు

### భూ యజమానులకు ఇబ్బందులు కలగొద్దు
### వాళ్ల భూముల రిజిస్ట్రేషన్లు చేసేయండి
### 22ఏ భూములపై కలెక్టర్లకు రేవంత్ ఆదేశాలు



తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ జాబితాలో భూములు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిజమైన ప్రైవేట్ భూ యజమానులకు ఊరట కల్పించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తన నివాసంలో ఉన్నతాధికారులతో సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): రాష్ట్ర వ్యాప్తంగా 22ఏ జాబితాలో ఉన్న భూముల వాస్తవ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. భూమి ప్రైవేట్ వ్యక్తికి చెందినదిగా నిర్ధారణ అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు 22ఏ జాబితాను సమగ్రంగా పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నిషేధిత జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రికార్డులు, యాజమాన్య హక్కులు, రెవెన్యూ వివరాలు, భూమి స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. మరో రెండు రోజుల్లో రెవెన్యూ తరువాయి 2 వ పేజీలో...



# 600 మందిపై వేటు

### ఎన్టీయేలో నిపుణులకు కేంద్రం ఉద్వాసన
### ఆఫీస్ చుట్టూ సీఐఎస్ఎఫ్ భద్రత


న్యూఢిల్లీ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరు, నిర్వహణపై కేంద్ర విద్యుత్, నూతన పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఎన్టీయే నిర్వహించే వివిధ పోటీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా సజావుగా తరువాయి 2 వ పేజీలో...



# పుల్లెల గాయత్రికి 'అర్జున'

## గోపీచంద్ కూతురికి ప్రతిష్ఠాత్మక అవార్డు

### చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కూడా
### 17 మంది క్రీడాకారులకు ప్రకటన
### ఖేల్ రత్న అవార్డు ప్రకటించని కేంద్రం
### ముగ్గురు కోచ్‌లకు ద్రోణాచార్య
### క్రీడా ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు




కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది.

(ఈవార్తలు - క్రీడావాణి)

డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించక పోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



పెద్ద పేగు పూర్తిగా లేకపోయినా మనిషి జీవించగలడు. పెద్ద పేగులో కొంత భాగాన్ని లేదా మెుత్తం పెద్ద పేగును తొలగించే శస్త్రచికిత్సను కోలెక్టమీ అంటారు. కొలొరెక్టల్ క్యాన్సర్, తీవ్రమైన పేగుల వాపు వ్యాధులు, పేగుల్లో అడ్డంకులు, తీవ్రమైన గాయాలు వంటి పరిస్థితుల్లో ఈ శస్త్రచికిత్స అవసరం అవుతుంది. పెద్ద పేగును తొలగించిన తర్వాత జీర్ణవ్యవస్థ క్రమంగా కొత్త పరిస్థితికి అలవాటు పడుతుంది. అయితే, పెద్ద పేగు లేకపోవడంతో నీటిని శోషించుకునే సామర్థ్యం తగ్గుతుంది.



# తప్పులు సరిచేస్తున్నం

## 24 గంటల్లో 34 రిజిస్ట్రేషన్లు

### 15 రోజుల పాటు దరఖాస్తుల పరిశీలన: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): 22ఏ నిషేధిత జాబితాలో చోటుచేసుకున్న పొరపాట్లను ప్రభుత్వం గుర్తించి, వాటిని వేగంగా సరిదిద్దే చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సామాన్య ప్రజల హక్కులు, ఆస్తులకు పూర్తి రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ

# సారీ చెప్తే బాధ పోతదా?



### తప్పు చేసి క్షమాపణల చెప్తే సరిపోదు
### పొంగులేటి రాజీనామా చెయ్
### '22ఏ'లో రాత్రికి రాత్రే అనేక కాలనీలు
### మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్

సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

19.8.2026

మేషం: కీలక వ్యవహారాలు అనుకూలిస్తాయి. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటాబయటా పరిస్థితులు అనుకూలిస్తాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి.

వృషభం: కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. కుటుంబ పెద్దలతో ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

మిధునం: ప్రముఖుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. వాహన అనుకూలత కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు.

సింహం: సన్నిహితులు, మిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది.

కన్య: ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. శ్రమతో కానీ కొన్ని పనులు పూర్తి కావు. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

తుల: గృహమునకు చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

వృశ్చికం: కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. బంధు మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆర్థిక పరంగా ఒత్తిడులు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి.

ధనస్సు: కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి.

మకరం: సన్నిహితుల నుంచి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణాల నుండి బయటపడగలుగుతారు.

మీనం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

# సర్కారే బ్లాక్‌మెయిలర్?

**మొదటి పేజీ తరువాయి**

ప్రజలు అకస్మాత్తుగా న్యాయపోరాటాల్లో చిక్కుకుంటే.. వారి పరిస్థితిని ఎవరు పట్టించుకోవాలి? హైడ్రా చర్యలపై తెలంగాణ హైకోర్టు పలు సందర్భాల్లో అధికారులను ప్రశ్నించింది. ముఖ్యంగా సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు పేర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌పై చర్యల విషయంలో హైకోర్టు అధికారుల తీరును ప్రశ్నించింది. 2005 నుంచి పెద్ద నిర్మాణం కొనసాగుతున్నా అధికారులకు ఎలా కనిపించలేదని ప్రశ్నించింది. హైడ్రా మాత్రం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటామని స్పష్టం చేసింది. జూన్‌లో మరో కేసులో హైకోర్టు మరింత ఘాటుగా స్పందించింది. ప్రైవేటు ఆస్తిలో హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టిన న్యాయస్థానం.. హైడ్రా చట్టానికి అతీతమైన సంస్థ కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాలన్నీ కోర్టు ఆదేశాలను పాటించాల్సిందేనని పేర్కొంది.



### ఇప్పుడు..22-ఏ నిషేధిత భూముల జాబితా

ఒక భూమి 22-ఏ జాబితాలో చేరితే ఆస్తి లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అమ్మలేరు.. కొనుగోలు చేయలేరు.. రిజిస్ట్రేషన్ ఆగిపోతుంది. ఇప్పటికే ఇల్లు కట్టుకున్నా, బ్యాంకు రుణం తీసుకున్నా, సంవత్సరాలుగా పన్నులు చెల్లిస్తున్నా.. ఒక్కసారిగా భూమి రికార్డులో నిషేధిత గుర్తు పడితే యజమాని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుంది. అయితే 22-ఏ జాబితాలో ఉండటం మాత్రమే భూమిపై ప్రభుత్వ యాజమాన్యాన్ని అంతిమంగా నిర్ధారించదు. 2026 ఏప్రిల్‌లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన 'సిపిల్ ఇన్‌ఫ్రా' తీర్పు ఈ విషయాన్ని స్పష్టంగా చూపించింది. వివాదాస్పద భూమిని కేవలం ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ 22-ఏ(1)(బీ) కింద నిషేధించడం చట్టపరంగా పరిశీలనకు లోబడి ఉంటుందని కోర్టు పేర్కొంది. అవసరమైన సందర్భాల్లో 22-ఏ జాబితా నుంచి తొలగించడానికి సంబంధిత అధికారులను ఆశ్రయించే అవకాశం ఉందని కూడా స్పష్టం చేసింది. అంటే అసలు సమస్య చట్టం ఉండటంలో కాదు.. చట్టాన్ని అమలు చేసే విధానంలో. ప్రభుత్వ భూమిని కాపాడాలి. చెరువులను కాపాడాలి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి. కానీ తప్పు చేసినవారిని గుర్తించే క్రమంలో నిర్దోషుల ఆస్తులు కూడా అనుమానాస్పదంగా మారితే.. బాధ్యత ఎవరిది?

### మధ్యతరగతి మనిషి కథ

అతడో సాధారణ మధ్యతరగతి వ్యక్తి..ఉద్యోగం చేస్తూ 20 ఏళ్లలో కూడబెట్టిన డబ్బు. కొంత బ్యాంకు రుణం. పిల్లల భవిష్యత్తు కోసం మిగిల్చిన పొదుపు. వాటన్నింటినీ కలిపి ఒక చిన్న స్థలం కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ జరిగింది. పత్రాలు ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకున్నాడు. విద్యుత్ మీటర్ వచ్చింది. ఇంటి పన్ను చెల్లిస్తున్నాడు. ఏళ్ల తర్వాత తన ఆస్తిని అమ్మి పిల్లల చదువు కోసం డబ్బు సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తే.. "ఈ సర్వే నంబర్ 22-ఏ నిషేధిత జాబితాలో ఉంది" అని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చెబితే? అక్కడి నుంచి అతని అసలు పోరాటం మొదలైంది. మొదట తహసీల్దార్ కార్యాలయం. తర్వాత రెవెన్యూ అధికారులు. రికార్డులు. పాత పహాణీలు. పట్టాదారు పాస్‌బుక్. రిజిస్ట్రేషన్ పత్రాలు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు. పాత ప్రభుత్వ ఉత్తర్వులు. అవసరమైతే న్యాయవాది. చివరికి కోర్టు. తాను భూమిని అక్రమంగా ఆక్రమించలేదని నిరూపించుకోవాల్సిన భారం కూడా తనపైనే పడుతోంది. ఇదే మధ్యతరగతి భయం.

### హైడ్రాపై కోర్టు హెచ్చరిక

2026 జూన్ 10న తెలంగాణ హైకోర్టు ఒక కేసులో హైడ్రా అధికారుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ప్రైవేటు ఆస్తిలోకి చట్టబద్ధ కారణం లేకుండా ప్రవేశించడం అనుమతించరాదని పేర్కొంది. 'హైడ్రా సూపర్ కాప్స్ ఆఫ్ గవర్నెన్స్ కాదు' అన్న భావాన్ని స్పష్టం చేస్తూ.. అధికారులు చట్టం పరిధిలోనే పనిచేయాలని న్యాయస్థానం పేర్కొంది.

### సల్కం చెరువు కేసులో అసలు వివాదం

సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్నట్లు పేర్కొంటున్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌పై హైకోర్టు ప్రశ్నలు సంధించింది. "ఇంత పెద్ద నిర్మాణం ఇంతకాలం అధికారుల దృష్టికి ఎలా రాలేదు?" అన్నదే కోర్టు ప్రధాన ప్రశ్నల్లో ఒకటి. అయితే విద్యార్థుల విద్యకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కూడా కోర్టు సూచించింది. హైడ్రా మాత్రం కోర్టు ఆదేశాల ప్రకారమే వ్యవహరిస్తామని ప్రకటించింది.

## కోర్టులు ఏం చెబుతున్నాయి?

2026 ఏప్రిల్ 17న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో 22-ఏ అంశంపై ముఖ్యమైన మార్గదర్శకాలను ప్రస్తావించింది. సంబంధిత భూమి ఏ నిబంధన కింద నిషేధిత జాబితాలో ఉందో స్పష్టంగా ఉండాలి. తప్పుడు వర్గీకరణ జరిగితే తొలగింపు కోరే అవకాశం ఉంది. 22-ఏ జాబితాలో చేర్చడంపై బాధితులు సంబంధిత అధికారులను ఆశ్రయించవచ్చు. అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించవచ్చు. కేవలం ప్రభుత్వానికి హక్కు ఉందని చెప్పడం, ఆ హక్కును చట్టపరంగా నిర్ధారించడం రెండూ ఒకటి కావు. ఇది మధ్యతరగతి భూ యజమానులకు అత్యంత కీలకమైన అంశం.

ప్రభుత్వ భూములను కాపాడటం తప్పు కాదు. చెరువులను పరిరక్షించడం కూడా తప్పు కాదు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించలేరు. కానీ చట్టాన్ని అమలు చేసే తీరు కూడా చట్టబద్ధంగానే ఉండాలి. ఒకవైపు హైడ్రా బుల్డోజర్.. మరోవైపు 22-ఏ నిషేధ ముద్ర.. మధ్యలో జీవితకాల పొదుపుతో భూమి కొనుగోలు చేసిన మధ్యతరగతి కుటుంబం. ఆ కుటుంబానికి ప్రభుత్వం చెప్పాల్సింది "నీ భూమి నిషేధిత జాబితాలో ఉంది.. నువ్వే తిరిగి నిరూపించుకో" అనే సమాధానం కాదు. "నీ హక్కు విషయంలో తప్పు జరిగితే.. ప్రభుత్వం స్వయంగా సరిచేస్తుంది" అనే భరోసా. ప్రజల ఆస్తులను రక్షించాల్సిన ప్రభుత్వమే వారి ఆస్తుల విషయంలో అనిశ్చితిని సృష్టిస్తే.. అది పరిపాలనా వైఫల్యమా? లేక అధికార వ్యవస్థలోని నిర్లక్ష్యమా? అన్న ప్రశ్న తప్పదు. అందుకే ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే.. భూములపై ప్రభుత్వం పట్టు పెంచుతోందా? లేక మధ్యతరగతి నడ్డిని బిగిస్తోందా? లేక సర్కారే బ్లాక్‌మెయిల్ చేస్తోందా? అన్నది తేలాల్సి ఉంది.

# తప్పులు సరిచేస్తున్నం

**మొదటి పేజీ తరువాయి**

జాబితా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమస్య పరిష్కార ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, గత 24 గంటల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో నాలుగు.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్ వ్యవస్థలోకి ఎక్కించే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని పొరపాట్లు జరిగాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వాల కాలంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన కొన్ని స్థలాలు కూడా సాంకేతిక లోపాల కారణంగా 22ఏ జాబితాలోకి చేరాయని చెప్పారు. "పొరపాటు జరిగిందని ప్రభుత్వం బహిరంగంగా అంగీకరిస్తోంది. అదే సమయంలో దాన్ని సరిదిద్దే బాధ్యతను కూడా తీసుకుంది. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు" అని పొంగులేటి అన్నారు. 22ఏ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీ రాబోయే 15 రోజుల పాటు రోజువారీగా దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన ప్రైవేట్ ఆస్తులను త్వరితగతిన 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. 22ఏ జాబితాలో కావాలనే భూములను చేర్చి, వాటిని తొలగించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఖండించారు. విమర్శలు చేయడం సులభమని, అయితే బాధ్యత తీసుకోవడం అంత సులభం కాదన్నారు. "మా శాఖలో పొరపాటు జరిగిందని మేమే అంగీకరించాం. దాన్ని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ధరణి వ్యవస్థతో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు, జరిగిన తప్పులకు హరీశ్‌రావు బాధ్యత తీసుకున్నారా? కనీసం క్షమాపణ చెప్పారా?" అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చోటుచేసుకున్న పరిణామాలకు కూడా హరీశ్‌రావు బాధ్యత వహించలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ప్రజలు మరిచిపోలేదన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని పొంగులేటి డిమాండ్ చేశారు. "నాపై ఏదైనా ఆరోపణ చేస్తే ఆధారాలతో మాట్లాడాలి. ఆధారాలు ఉంటే ప్రజల ముందు పెట్టాలి" అన్నారు. ఫీనిక్స్, రాఘవ తదితర సంస్థలతో వ్యాపార రంగంలో లావాదేవీలు జరగడం సహజమేనని, వాటిని రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదన్నారు. తాను రెండు దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్నానని, అంచెలంచెలుగా ఎదిగానని తెలిపారు. తన వ్యాపార నేపథ్యం, ప్రస్థానం గురించి రాష్ట్ర ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. "తాటాకు చప్పుళ్లకు నేను భయపడను. ఆరోపణలు చేసేవారు ముందుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి" అని మంత్రి స్పష్టం చేశారు.



# పుల్లెల గాయత్రికి 'అర్జున'

**మొదటి పేజీ తరువాయి**

కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

### అవార్డు గ్రహీతల జాబితా:

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)
తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)
ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)
నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)
విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)
లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)
సుర్జీత్, పూజ (కబడ్డీ)
ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)
ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)
అరవింద్ సింగ్ (రోయింగ్)
అఖిల్ షెయోరాన్ (షూటింగ్)

అర్జున అవార్డు (జీవన సాఫల్యం)
అరుమై నాయగం (ఫుట్‌బాల్)

ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)
ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)
పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)
నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)

జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)
ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)
వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్
ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

# సారీ చెప్తే బాధ పోతదా?

**మొదటి పేజీ తరువాయి**

నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఏ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతాన లక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు.

# ప్రైవేట్ భూములు తాకొద్దు

**మొదటి పేజీ తరువాయి**

అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించనున్నట్లు తెలిపారు. 22ఏ భూముల సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. అర్హులైన ప్రైవేట్ భూ యజమానులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సమస్యలను ఆసరాగా చేసుకుని దళారులు, మధ్యవర్తులు ప్రజలను మోసం చేసే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు. 22ఏ జాబితా నుంచి భూమిని తొలగిస్తామని లేదా రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పే అనధికార వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. భూ సమస్యలను ప్రభుత్వ అధికారిక వ్యవస్థ ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 22ఏ భూములపై సామాజిక మాధ్యమాలు, ఇతర మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న వదంతులను నమ్మవద్దని సీఎం సూచించారు. నిజమైన ప్రైవేట్ భూముల యజమానుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 22ఏ జాబితాపై భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఎం సమీక్షకు ప్రాధాన్యం ఏర్పడింది.

# 600 మందిపై వేటు

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా, మౌలిక వసతుల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం ఎన్‌టీఏతో సమావేశమై, పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని భద్రతా, సంబంధిత మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకు ఎన్‌టీఏ తీసుకున్న చర్యలను డైరెక్టర్ జనరల్ కూడా వివరించారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన, వాటి పరిశీలనను మరింత పటిష్టం చేసేందుకు నాలుగు అంచెల క్వశ్చన్ పేపర్ పరిశీలన వ్యవస్థను అమల్లోకి తీసుకొస్తున్నారు. 600 మంది నిపుణుల స్థానంలో కొత్తవారిని నియమిస్తూ, పరీక్షా బృందాన్ని పునర్వ్యవస్థీకరించినట్లు ఎన్టీయే పేర్కొంది. పరీక్ష పత్రాల పరిశీలనను పటిష్టం చేయడానికి నాలుగు అంచెల ప్రశ్నపత్రాల తనిఖీ వ్యవస్థను అమలు చేయనున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లో 20-25 మంది అధికారులను విధుల్లోకి తీసుకోనున్నారు.

# ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి

## పేదల కోసం భూలక్ష్మి పథకం తీసుకొస్తాం.. సామాజిక న్యాయం జరగాలంటే భూ పంపిణీ జరగాలి

**రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం నడుస్తోంది**

**తెలంగాణ భూమాతను చెరబట్టిన సీఎం కుటుంబం**

**సీఎం రేవంత్ రెడ్డిది ఆటవిక న్యాయం**

**టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజం**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం జరగాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి భూ లక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆమె చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం కింద ప్రతి కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామన్నారు. బంజరాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో సామాజిక న్యాయం అనేది కేవలం నినాదం కాకూడదని దాని ద్వారా విప్లవాత్మక గుణాత్మక మార్పు రావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ మార్పు కోసం తెలంగాణలో మేధావులంతా ఆలోచించి తమతో కలిసి రావాలన్నారు. ఈ నెల 6న తాము నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు వస్తాయని తాము చెప్పామని...ఇప్పుడు అదే జరుగుతోందన్నారు. 31 నెలలుగా సామాజిక న్యాయం గురించి మాట్లాడని ముఖ్యమంత్రి ఇప్పుడు సామాజిక న్యాయం రాగం ఎత్తుకున్నారన్నారు. కానీ ఆయన చెప్పేది సామాజిక న్యాయం, చేసేది ఆటవిక న్యాయం అన్నారు. ప్రభుత్వంలో, పార్టీలో బీసీలకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయం చేసే అవకాశం ఉన్న సరే చేయకుండా రాజకీయాల కోసం మాత్రమే ఆయన సామాజిక న్యాయం అంటున్నారని కవిత మండిపడ్డారు. ఎప్పుడో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం లాక్కుంటూ ముఖ్యమంత్రి కుటుంబం తెలంగాణ భూమాత చెరబట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు భూదొంగలంటూ కవిత విమర్శించారు.




**భూలక్ష్మి ద్వారా కుటుంబానికి ఎకరం భూమి**

తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలన్నదే తమ ఆకాంక్ష అని కవిత చెప్పారు. కేవలం నినాదాల ద్వారా ఆ కల తీరదని కవిత అన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం తాము ఓ ఓ వైపు సభలు, ధర్నాలు, ఆందోళనల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతూ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. అదే విధంగా సామాజిక న్యాయ తెలంగాణ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా ఒక్కొక్కటిగా చేపడతామన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ అనేది మళ్లీ భూ పంపిణీ కార్యక్రమం చేపట్టినప్పుడే సాధ్యమవుతుందని కవిత అన్నారు. ప్రతి కుటుంబానికి భూమి కల్పించినప్పుడే వాళ్లంతా గౌరవంగా బతుకుతారన్నారు. పేదలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, ఆదీవాసీలకు భూమి అంటే ఎమోషన్, పంచప్రాణాలని కవిత చెప్పారు. అందుకే తమ పార్టీ తరఫున భూలక్ష్మి అనే పథకాన్ని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామని కవిత చెప్పారు. భూమి పంపిణీకి సంబంధించి పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆధీనంలో 60 లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. నిజాం ఇచ్చిన భూములు, భూదాన్ భూములు కూడా లక్షల ఎకరాల్లో ఉన్నాయన్నారు. భూదాన్ భూములకు సంబంధించి లక్ష ఎకరాలు లెక్కలేకుండా పోయాయని వాటిని పేదలకు ఇచ్చి ఉంటే ఎంతో మేలు జరిగేదని కవిత చెప్పారు. ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి మనసు రావటం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కచ్చితంగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి ఎకరం భూమి ఇస్తామన్నారు.

**ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు**

తెలంగాణ లో ముఖ్యమంత్రి కుటుంబమే భూదోపిడీకి పాల్పడుతుందని కవిత తీవ్రంగా విమర్శలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం (ఆర్ఆర్ఆర్) నడుస్తుందన్నారు. పేదలకు భూములు పంచాల్సిన ప్రభుత్వమే పరిశ్రమల పేరుతో వాళ్ల భూములు లాక్కుంటుందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల నుంచి 30 వేల ఎకరాలు గుంజుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పీవీ, నిజాం లాంటి వాళ్లు పేదలకు భూములు ఇచ్చారని వాటికి యాజమాన్య హక్కులు ఇస్తామని ఎన్నికల సందర్భంలో మాట ఇచ్చి ఇప్పుడు వాటిని లాక్కుంటారా అని మండిపడ్డారు. పేదల భూములు గుంజుకుంటామంటే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు. ముఖ్యమంత్రి కుటుంబం, వారి ఏడుగురు సోదరుల గురించి దేశమంతా కథలు, కథలుగా చెప్పుకుంటారన్నారు. తెలంగాణ భూమాత చెరబట్టి ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ దోపిడీ చేస్తున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబం భూ దొంగలు అని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అన్నట్లుగా ఒకరిని గెలిపిస్తే ఇంకొందరు అధికారం చెలాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ని గెలిపిస్తే వారి ఏడుగురు అన్నదమ్ములు, శ్రీధర్ బాబును గెలిపిస్తే వాళ్ల సోదరుడు, భట్టి ని గెలిపిస్తే వాళ్ల కుటుంబం, పొంగులేటిని గెలిపిస్తే వాళ్ల కొడుకు ప్రజలపై జులుం చేస్తున్నారన్నారు. దాదాపు 2 వందల మంది ముఠా ఇలా ప్రజలపై పడి ఇబ్బందులకు గురిచేస్తుందని కవిత అన్నారు. అటు 22 ఏ పేరుతో భూ దోపిడీకి ప్రభుత్వం రాచమార్గం ఏర్పాటు చేసుకుంటుందని కవిత విమర్శించారు. గతంలో ధరణి, ఇప్పుడు భూ భారతిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. భూముల విషయంలో పేదలకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదన్నారు.

**చెప్పేది సామాజిక న్యాయం.. చేసేది ఆటవిక న్యాయం**

ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేక వన్నె పులి అంటూ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చెప్పేది సామాజిక న్యాయం. కానీ చేసేదీ ఆటవిక న్యాయం అని కవిత అన్నారు. ఈ నెల 6 న తాము చేపట్టిన సామాజిక సంకల్ప సభ కారణంగానే ముఖ్యమంత్రి నోట సామాజిక న్యాయం అనే మాట అనివార్యంగా వచ్చిందని కవిత అన్నారు. సామాజిక అన్యాయం అనాల్సింది పోయి ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అన్నాడని ఆయన మాటలను ప్రజలు నమ్మరని చెప్పారు. నిజంగా సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే 16 మంది మంత్రివర్గంలో ముగ్గురే బీసీలు మంత్రులు ఎందుకుంటారని ఆమె ప్రశ్నించారు. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే బీసీల కోసం కేవలం 5 వేల 5 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని కవిత చెప్పారు. బీసీల సంఖ్య ఎంత మీరు చేసిన ఖర్చు ఎంత? ఇదేనా సామాజిక న్యాయం అని ప్రశ్నించారు. వీహెచ్ లాంటి సీనియర్ బీసీ నాయకుడికి, శివధర్ రెడ్డి అనే ఓ అధికారికి అడ్వయిజర్ పదవులు ఇస్తే వీహెచ్ కు ఇచ్చిన ర్యాంక్, జీతం ఎందుకు తక్కువగా ఉన్నాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యల విషయంలో కూడా అగ్రకులాలకు ఒక విధంగా, ఇతరులపై ఒక విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్టీఐ కమిషనర్లను నియమిస్తే అందులో ఒక్క బీసీ కూడా లేదని కవిత చెప్పారు. ఇద్దరు మహిళలను మాత్రమే మంత్రివర్గంలో తీసుకొని విజయశాంతి లాంటి నేతకు అన్యాయం చేశారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంటే ఇదేనా అని కవిత ప్రశ్నించారు. బీసీ మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవమానించిన సంఘటనలను గుర్తు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అటు ప్రభుత్వంలో, పార్టీ లో న్యాయం చేయగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ ఈ ముఖ్యమంత్రి అన్యాయం చేస్తున్నాడని కవిత అన్నారు. అలాంటి వ్యక్తి సామాజిక న్యాయం గురించి మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదన్నారు. కచ్చితంగా తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పాటు పడతామని అన్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## అర్ధరాత్రి పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు

**బీఆర్ఎస్ నేతల అడ్డగింత, నర్సంపేటలో తీవ్ర ఉద్రిక్తత**

నర్సంపేట, ఆగస్టు 18 (ఈవార్తలు): వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం అర్ధరాత్రి హైడ్రామా చోటుచేసుకుంది. దివంగత మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అధికారులు తొలగించడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నర్సంపేట మెడికల్ కాలేజీ సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని మంగళవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించినట్లు తెలుస్తోంది. విగ్రహాన్ని తొలగించడంతో పాటు గద్దెను కూడా నేలమట్టం చేశారు. విగ్రహం తొలగింపు నేపథ్యంలో నర్సంపేటలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సుమారు 1500 మంది పోలీసులు నర్సంపేట పట్టణంలో బందోబస్తు నిర్వహించినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఇక విగ్రహం తొలగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో ఆంక్షలు విధించారని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపించాయి. అక్కడికి ఎవరినీ అనుమతించకుండా పోలీసులు చర్యలు చేపట్టారని.. సంఘటన స్థలాన్ని పరిశీలించేందుకు మీడియాను కూడా పోలీసులు అనుమతించలేదని తెలుస్తోంది.

## 'అర్జున' గ్రహీతలకు సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు, షట్లర్ పుల్లెల గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరూ తెలంగాణతో పాటు దేశానికే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి, ధనుష్ తెలంగాణకు గర్వకారణం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వీరితో పాటు 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు గెలుచుకున్న విజేతలందరికీ ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడా రంగంలో వారు చూపిన పట్టుదల, నిబద్ధత, కఠోర శ్రమ యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, మరెన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## టోల్ ఫ్రీ నెంబర్ పేరుతో కమీషన్లు

**పొంగులేటిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): హైవేలపై వాహనాల వద్ద టోల్ ఫీజు వసూలు చేసినట్లే.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కమీషన్లు దండుకుంటున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన ఆస్తులను సరిచేస్తామని ప్రకటించి తీసుకొచ్చిన 1800 599 4788 టోల్ ఫ్రీ నెంబర్ వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆయన విమర్శించారు. ఆ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగానే ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి 30 శాతం కమీషన్ ఇస్తేనే పని పూర్తి చేస్తామని డీల్ మాట్లాడుతున్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు నేరుగా నిధులు వసూలు చేసుకోవడానికి ఆస్తులను, చివరకు ఇందిరమ్మ ఇళ్లను కూడా నిషేధిత జాబితాలోకి తీసుకెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గీత, చేనేత కార్మికులకు కొత్త పింఛన్లు

**సీఎం రేవంత్ కీలక ప్రకటన**

**ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): రాష్ట్రంలో గీత, చేనేత కార్మికులకు సాచ్యురేషన్ స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తామనిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ పైన ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం.. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. గౌడ సోదరులకు 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామని.. ప్రమాదవశాత్తు గౌడ సోదరులు చనిపోతే 5 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నామని అన్నారు. 'గీత కార్మికుల వృత్తిని కాపాడటానికి నీటి పారుదల ప్రాజెక్టుల కాలువల గట్లపైన ఈత, తాటి చెట్లను నాటాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ మంత్రికి నా సూచన. దొరలు, భూస్వాములు, పెత్తందార్లపై పోరాటం సాగించిన యోధుడు, ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పండుగ సాయన్న పోరాటం, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసు. అక్టోబర్ 22న సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. గీత కార్మికులు, గౌడన్నలు ఎంతో కాలంగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న నేపథ్యంలో నేనే స్వయంగా నెక్లెస్ రోడ్ చౌరస్తాకు వెళ్లి స్థలాన్ని పరిశీలించి జ్యోతిరావు పూలే దంపతులకు విగ్రహం ఉండాలని స్థలాన్ని ఎంపిక చేశాను. అలాగే, సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో ట్యాంక్ బండ్ పర్యాటక శాఖ కార్యాలయాన్ని మరోచోటికి తరలించి ఆ స్థలంలో పాపన్న విగ్రహం ఏర్పాటు చేసుకున్నాం. హైదరాబాద్ సందర్శనకు వచ్చే పర్యాటకులు, గణేష్ నిమజ్జన సమయంలో ట్యాంక్ బండ్ నుంచి ఎవరు వెళ్లినా ఒక స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశాం. సర్వాయి పాపన్న ఒక కులానికి, కుటుంబానికి కాదు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు. బహుజనులతో కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారు. ఆయన స్ఫూర్తి ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు ఉండాలి. ఇది బహుజనుల తెలంగాణ. సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఇందిరమ్మ పాలనలో ఉందని నిరూపించాం. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారు. బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు కాబట్టే ఆయనకు ఆ కీర్తి, గౌరవం దక్కింది. కులవృత్తిని కొనసాగించండి. గౌరవించండి. కానీ పిల్లలను మాత్రం చదివించండి. పిల్లల తలరాతలను మార్చే శక్తి మన చేతుల్లో ఉంది. పిల్లలను చదివించి వారు ఉన్నతస్థానానికి చేరుకుని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేయాలి. విద్యార్థుల కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తాం. నాణ్యమైన విద్యతో పాటు భోజనం కూడా ఇస్తాం. గతంలో సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టలేదు. మా ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నాం. పాలు, రాగిజావ పిల్లలకు ఇస్తున్నాం. మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే పరిష్కారం. కష్టమైనా, నష్టమైనా పిల్లలను బడికి పంపించాలి. వాళ్లను చదివించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఏటీసీల్లో చేరేవాళ్లకు నెలకు 2 వేల రూపాయల ఉపకార వేతనం ఇస్తున్నాం. ఈ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం పనిచేస్తుంది. సామాజిక న్యాయం కోసం రాష్ట్రంలో బీసీ కులగణన చేశాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేశాం. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నాం.' అని పేర్కొన్నారు.



## ఈసీ లక్షల ఓట్లను తొలగించింది

**టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం నిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## భవన నిర్మాణ అనుమతికి లంచం డిమాండ్

**ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): ఏసీబీకి మరో అవినీతి చేప చిక్కింది. భవన నిర్మాణ అనుమతి ఫైల్‌ను ప్రాసెస్ చేసి, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేసేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చార్మినార్ జోన్‌కు చెందిన ఈ మేరకు సంతోష్‌నగర్ సర్కిల్-25 అధికారిణి సీహెచ్ ప్రభావతిని ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. భవన నిర్మాణ అనుమతి కోసం ఓ వ్యక్తి ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ఫైల్‌ను ప్రాసెస్ చేసి, సంబంధిత భవన నిర్మాణ అనుమతి ఉత్తర్వుతో పాటు పని ప్రారంభ లెటర్ అందించాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానికి ఉంది. అయితే ఈ పని పూర్తి చేసేందుకు ప్రభావతి సదరు వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. లంచం డిమాండ్ ఫిర్యాదు అందటంతో ఏసీబీ అధికారులు పక్కా స్కెచ్వేశారు. బిల్డింగ్ పర్మిషన్ కోసం వచ్చిన వ్యక్తి నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా ప్రభావతిని పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న లంచం మెత్తాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగినిగా తన అధికారిక విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాల్సిన ఆమె ఇలా అడ్డదారులు తొక్కుతూ డబ్బులు డిమాండ్ చేసినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ మేరకు ఆమెను నాంపల్లిలోని ఏసీబీ కేసుల అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

## రాత్రికి రాత్రే 22ఏలోకి ప్రైవేటు భూములు

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధ్వజం**

హైదరాబాద్, ఆగస్టు 18 (ఈవార్తలు): తెలంగాణలో నిషేధిత22ఏ భూముల జాబితా వ్యవహారం హాట్ టాఫిక్‌గా మారింది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రైవేటు భూములు నిషేదిత 22ఏ జాబితాలోకి చేరటం, వాటి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవటంతో భూ యజమానులు, ప్లాట్ల యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ వ్యవహారం కీలక కామెంట్స్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 22ఏ జాబితాలో చోటుచేసుకున్న లొసుగుల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుంటే.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. 22ఏ జాబితా అంశంపై ప్రభుత్వం త్వరలోనే సమగ్ర విచారణ చేపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా సరే.. ఎంతటి స్థాయిలో ఉన్న వ్యక్తులైనా కఠిన చర్యలు తప్పవని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భూములను నిషేదిత జాబితాలో చేర్చే ప్రక్రియలో ఎక్కడ లోపాలు జరిగాయి..? ఎవరి ఆదేశాలతో మార్పులు చోటు చేసుకున్నాయి..? ఏ స్థాయిలో అధికారుల ప్రమేయం ఉంది..? అనే పూర్తి అంశాలు విచారణలో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయంలో కీలక బాధ్యతలు నిర్వహించిన కొందరు అధికారుల పాత్ర కూడా ఈ వ్యవహారం వెనుక ఉండి ఉండొచ్చునని తాను బలంగా అనుమానిస్తున్నట్లు కోమటిరెడ్డి వెల్లడించారు.



## బిల్లుల కోసం ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన

**ఆర్టీఐ దరఖాస్తుతో పంచాయతీ కార్యదర్శి నోటీసులు**

**బిల్లులు నిలిచిపోయాయని లబ్ధిదారుల ఆవేదన**

జగిత్యాల, ఆగస్టు 18 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా చివరి దశ బిల్లులు చెల్లించలేదని ఆరోపిస్తూ బుగ్గారం గ్రామానికి చెందిన 40 మంది లబ్ధిదారులు మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి అక్బర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. మంజూరు పత్రాల వివరాలు కోరుతూ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి దరఖాస్తు చేయడంతో పంచాయతీ కార్యదర్శి 40 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారని, దీంతో తమ బిల్లులు నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు చెల్లించకపోతే ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన పేదలకే ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. బుగ్గారం మండలానికి 200 ఇళ్లు మంజూరు కాగా, బుగ్గారం గ్రామానికి 40 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పేదలను ఇబ్బంది పెడితే సహించబోమన్నారు. పంచాయతీ కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ.. ఆర్టీఐ దరఖాస్తు మేరకే నోటీసులు ఇచ్చామని, లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదన్నారు. సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

## నూకపల్లి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

**పాఠశాల, అంగన్‌వాడీ భవనాలకు స్థలాల పరిశీలన కలెక్టర్ సత్యప్రసాద్**

మల్యాల, ఆగస్టు 18 (ఈవార్తలు): నూకపల్లి అర్బన్ కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన.. పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి తదుపరి చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్.. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించి పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ భవనాల ఏర్పాటుతో ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. కాలనీలో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతుల పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టి వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, హౌసింగ్ డీఈ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టు రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

మల్యాల, ఆగస్టు 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన.. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రహదారి పరిస్థితి, వాహనాల రాకపోకలు, వాహనాల వేగం తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అన్ని కోణాల్లో విచారించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి వాస్తవాలను వెలికితీసేలా దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ముందున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మధ్య తగినంత దూరం పాటించాలని తెలిపారు. ప్రధాన రహదారులపై ప్రయాణించేటప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, డీటీఓ మహమ్మద్ సందాని, మల్యాల సీఐ రాజ్‌కుమార్, ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు.

## లచ్చక్కపేట శివారులో పేకాట.. ఐదుగురు అరెస్ట్

సారంగాపూర్, ఆగస్టు 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం, లచ్చక్కపేట గ్రామ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులోని ఓ ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సారంగాపూర్ పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,550 నగదు, పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పి. గీత, తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఏ1 శీలం శంకర్, ఏ2 పల్లపు నాగరాజు, ఏ3 పల్లపు సతీష్, ఏ4 అలెపు రఘు, ఏ5 పోగుల ఎల్లారెడ్డి ఉన్నారు. వీరంతా వడ్డెర కాలనీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సారంగాపూర్, ఎస్సై పి. గీత, హెచ్చరించారు.



# పాపన్న స్ఫూర్తితో సమాజ మార్పు తేవాలి

**గీత కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి.. ప్రభుత్వానికి మాజీమంత్రి జీవన్‌రెడ్డి డిమాండ్**

రాయికల్, ఆగస్టు 18 (ఈవార్తలు): సర్వాయి పాపన్న స్ఫూర్తితో సమాజంలో మార్పు, రాజకీయ మార్పు కోసం అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలం అల్లిపూర్‌లో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. సాధారణ గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. కిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకుని కోట నిర్మించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని తెలిపారు. గౌడ కులంలో జన్మించిన పాపన్న గీత కార్మికులకు గర్వకారణమన్నారు. గీత వృత్తి అత్యంత ప్రమాదకరమైనదని, గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్ట్‌షాపుల కారణంగా గీత వృత్తి దెబ్బతింటోందన్నారు. గీత కార్మికులకు ప్రమాద బీమా ఉన్నప్పటికీ ఏడాది కాలంగా ఆర్థిక సాయం అందడం లేదని ఆరోపించారు. భూమిలేని గీత కార్మికులకు భూ కొనుగోలు పథకం ద్వారా భూమి అందించి చెట్ల పెంపకానికి అవకాశం కల్పించాలని కోరారు. అల్లిపూర్ గురుకుల పాఠశాలలో అధిక శాతం బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నారని, గురుకుల పాఠశాలలను తరలించడం సరికాదన్నారు. కొత్తగా మెరుగైన విద్య కోసం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగిస్తూ బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## ప్రాణాపాయ రోగులకు సీఆర్ఆర్‌టీ వరం

**కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి**




రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 18 (ఈవార్తలు):ఐసీయూలో చికిత్స పొందుతూ మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్న, సాధారణ డయాలసిస్‌ను తట్టుకోలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు కంటిన్యూయస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్ఆర్‌టీ) కీలకమైన ప్రాణరక్షక చికిత్సగా ఉపయోగపడుతుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ భవన్‌లో సీఆర్ఆర్‌టీ యంత్రం పనితీరు, వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. తీవ్ర అనారోగ్యంతో ఐసీయూలో ఉన్న రోగుల్లో మూత్రపిండాల పనితీరు అకస్మాత్తుగా దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాంటి సమయంలో సాధారణ డయాలసిస్ వల్ల రక్తపోటులో మార్పులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో సీఆర్ఆర్‌టీ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ విధానంలో రోగి పరిస్థితికి అనుగుణంగా నెమ్మదిగా, నిరంతరాయంగా డయాలసిస్ నిర్వహించవచ్చని తెలిపారు. శరీరంలోని వ్యర్థ పదార్థాలు, అదనపు ద్రవాలను క్రమంగా తొలగించడం ద్వారా రోగిపై చికిత్స భారం తగ్గుతుందని పేర్కొన్నారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై అదనపు ఒత్తిడి తగ్గించడంలో ఇది సహాయపడుతుందని చెప్పారు. బహుళ అవయవాల పనితీరు దెబ్బతిన్న రోగుల చికిత్సలో సీఆర్ఆర్‌టీ కీలకంగా మారిందని వైద్యులు తెలిపారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో ఈ సాంకేతికతను వినియోగిస్తూ పలువురు తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు చికిత్స అందించినట్లు వెల్లడించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మనోజ్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న జయంతి



కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ఈవార్తలు):బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను బాలానగర్‌లో ఘనంగా నిర్వహించారు. బాలానగర్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు పులి శ్రీకాంత్ పటేల్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి వద్ద ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండ్ల సతీష్ గౌడ్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య తదితరులు హాజరయ్యారు. బాలు బహుజన కళాబృందం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పులి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుంచి ఎదిగి ప్రజలను సమీకరించి తెలంగాణలో స్వీయ పాలన కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, సామాన్యుల ఆత్మగౌరవం కోసం పోరాడిన చారిత్రక ప్రజా యోధుడని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ప్రజల ఆత్మగౌరవం కోసం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజ్‌గిరి అధికార ప్రతినిధి మధు మోహన్, టీడీపీ కార్యదర్శి చిలకూరి హరిచంద్, ఐఎన్‌టీయూసీ నాయకుడు కూన రవీందర్ గౌడ్, బీజేపీ బాలానగర్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, న్యాయ నిపుణుడు ఎల్.ఎస్.రావు, ఎంఐఎం నాయకుడు మహంకాళి శంకర్, కాంగ్రెస్ నాయకులు పులి శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, దండు రవి గౌడ్, మహిళా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



## కుంగిన వంతెనకు తక్షణ మరమ్మతులు

**పరిశీలనలతో కాదు.. శాశ్వత పరిష్కారం కావాలి**

**బీజేపీ నేత కాంచి మహేందర్ డిమాండ్**

కూకట్‌పల్లి, ఆగస్టు 18 (ఈవార్తలు): ఫతేనగర్‌లో నేతాజీ కాలనీ–శోభన కాలనీల మధ్య కాలువపై ఉన్న వంతెన కుంగిపోయి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ ఆరోపించారు. వంతెనకు ఆనుకుని భారీగా చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు పది రోజుల క్రితం మాజీ కార్పొరేటర్, ఏఈతో పాటు అధికారులు ప్రాంతాన్ని పరిశీలించినా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. కుంగిపోయిన వంతెనతో పాటు చెత్త పేరుకుపోవడం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. "అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోతే సమస్య పరిష్కారం కాదు. ప్రజలకు తక్షణమే శాశ్వత పరిష్కారం కల్పించాలి" అని కాంచి మహేందర్ అన్నారు. వంతెనకు మరమ్మతులు చేపట్టడంతో పాటు పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని కోరారు.



## అనుమతులు లేకుండా నిర్మాణాలు

**రెండు భవనాలను కూల్చివేసిన మున్సిపల్ అధికారులు**

వేములవాడ అర్బన్, ఆగస్టు 18 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న రెండు భవనాలను మంగళవారం సిబ్బంది సహకారంతో కూల్చివేశారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించిన అధికారులు సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశారు. అయితే సరైన సమాధానం ఇవ్వకుండా నిర్మాణ పనులు కొనసాగించడంతో కూల్చివేత చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పట్టణంలో అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. భవన నిర్మాణానికి ముందు నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలని సూచించారు.

## ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మృతి

రాయికల్, ఆగస్టు 18 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో మంగళవారం రాత్రి విషాదం చోటుచేసుకుంది. భూపతిపూర్––కొత్తపేట మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ అదుపుతప్పిన వాహనం టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళాసంఘ భవనానికి ఎమ్మెల్యే సంజయ్ భూమిపూజ

జగిత్యాల రూరల్, ఆగస్టు 18 (ఈవార్తలు): జగిత్యాల రూరల్, మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ భూమిపూజ చేశారు. రూ.10 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించనున్నారు. మహిళా సంఘాలకు శాశ్వత భవనం అందుబాటులోకి రావడంతో వారి కార్యకలాపాలకు మరింత సౌకర్యం కలగనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన వసతులు కల్పిస్తోందన్నారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ వంశీ, ఉపసర్పంచ్ సంతోష్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఆర్ఓ హకీమ్, ఎంపీఓ రవిబాబు, ఏఈ విజయ్, ఏపీఎం రాజు, మహిళా సంఘాల నాయకులు దివ్య, భాగ్యలక్ష్మి, పద్మ, గడ్డం లక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల, ఆగస్టు 18 (ఈవార్తలు): భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తులు, సాదా బైనామా, మీ సేవకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలించారు. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మీ సేవ సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు అందించాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి సంబంధించిన నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఆదేశించారు. తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కొడిమ్యాల తహసీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## రాజశేఖర్‌కు బ్లాక్ బెల్ట్ మూడో డిగ్రీ

**కరాటేగ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభ**

వేములవాడ అర్బన్, ఆగస్టు 18 (ఈవార్తలు): వేములవాడకు చెందిన సీనియర్ కరాటే ఇన్‌స్పెక్టర్ కనికరపు రాజశేఖర్ బ్లాక్ బెల్ట్ మూడో డిగ్రీ సాధించారు. కరీంనగర్‌లోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో మంగళవారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఆయన ప్రతిభ కనబరిచారు. వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో రాజశేఖర్ 15 ఏళ్లుగా శిక్షణ పొందుతున్నారు. పరీక్షల్లో కటాస్, కుమిటే విన్యాసాలను ప్రతిభావంతంగా ప్రదర్శించి మూడో డిగ్రీ బ్లాక్ బెల్ట్ సాధించారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ చేతుల మీదుగా రాజశేఖర్ బ్లాక్ బెల్ట్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆయనను ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షుడు కొండ దేవయ్య, కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నన్, పలువురు కరాటే ఇన్‌స్పెక్టర్లు అభినందించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు రాజశేఖర్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న గుడి చెరువు డ్రైనేజీ పనులు ప్రారంభించాలి

**సెప్టెంబర్ 20లోగా పనులు చేపట్టకపోతే మున్సిపల్ ముట్టడి**

**బీజేపీ నేత రేగుల శ్రీకాంత్ వార్నింగ్**



వేములవాడ అర్బన్, ఆగస్టు 18 (ఈవార్తలు): వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన పవిత్ర గుడి చెరువులోకి మురుగునీరు చేరకుండా తక్షణమే డ్రైనేజీ మళ్లింపు పనులు చేపట్టాలని బీజేపీ నాయకుడు రేగుల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 20లోగా పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పట్టణంలోని డ్రైనేజీ నీరు నేరుగా గుడి చెరువులోకి చేరుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. నిధులు అందుబాటులో ఉండటంతో పాటు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నా పనులు ప్రారంభించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. భూ వివాదం పేరుతో పనులను నెలల తరబడి నిలిపివేయడం సరికాదన్నారు. సమస్యను పరిష్కరించి డ్రైనేజీ మళ్లింపు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువు కలుషితం కావడంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల గడువులోగా పనులు ప్రారంభించకపోతే పట్టణ ప్రజలు, రాజన్న భక్తులను సమీకరించి మున్సిపల్ కార్యాలయ ముట్టడి చేపడతామని శ్రీకాంత్ తెలిపారు. గుడి చెరువును పరిరక్షించేందుకు ప్రజలంతా ఉద్యమానికి సహకరించాలని కోరారు.

# టాటా సన్స్ చరిత్రలో తొలిసారి

**కోరం లేక ఏజీఎం వాయిదా**

ముంబై: భారత కార్పొరేట్ దిగ్గజం టాటా సన్స్ 108 ఏళ్ల చరిత్రలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) తొలిసారిగా వాయిదా పడింది. మంగళవారం మధ్యాహ్నం జరగాల్సిన ఈ సమావేశానికి అవసరమైన 'కోరం' లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ అనూహ్య పరిణామం కార్పొరేట్ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. టాటా సన్స్ నిబంధనల ప్రకారం, సంస్థలో సుమారు 51.5 శాతం మెజారిటీ వాటా కలిగిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు సంయుక్తంగా ఒక అధీకృత ప్రతినిధిని నామినేట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే సమావేశానికి అవసరమైన కోరం పూర్తవుతుంది. అయితే, సర్ రతన్ టాటా ట్రస్ట్ కార్యకలాపాలు, ప్రధాన నిర్ణయాలపై మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆంక్షలు విధించడంతో, ఉమ్మడి ప్రతినిధిని నామినేట్ చేయడంలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఫలితంగా కోరం కొరత ఏర్పడి సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ముంబైలోని టాటా గ్రూప్ ప్రధాన కార్యాలయం 'బాంబే హౌస్'లో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమైంది. టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, బోర్డు సభ్యులు సౌరభ్ అగర్వాల్, అనితా మరాంగోలీ జార్జ్ ప్రత్యక్షంగా హాజరుకాగా, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, హరీశ్ మన్వానీ, వేణు శ్రీనివాసన్, మెహ్లీ మిస్త్రీ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలు, డివిడెండ్ సహా ఇతర కీలక అంశాలకు ఈ ఏజీఎంలో ఆమోదం తెలపాల్సి ఉంది. 2027 ఫిబ్రవరి తర్వాత తాను పదవిలో కొనసాగబోనని చంద్రశేఖరన్ ఇప్పటికే సంకేతాలిచ్చిన నేపథ్యంలో, ఆయన బోర్డు సభ్యత్వంపై కూడా ఇందులో చర్చ జరగాల్సి ఉంది. కాగా, త్వరలోనే బోర్డు సమావేశమై ఏజీఎం నిర్వహణకు కొత్త తేదీని ఖరారు చేస్తుందని టాటా సన్స్ వర్గాలు వెల్లడించాయి.

# పీఎం కేర్స్ ఫండ్‌లో 8,452 కోట్లు

న్యూఢిల్లీ: పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ. 5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ. 479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ. 92.83 లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ. 324.66 కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలో చేరాయి. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఈ ఫండ్ ద్వారా కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూతనిచ్చే 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం కింద వ్యయం చేస్తున్నారు.

# 'స్థానికం'లో బీసీలకు 34 శాతం

అమరావతి, ఆగస్టు 18 (ఈవార్తలు): "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# 'నోటిఫైడ్ వ్యాధి'గా పాముకాటు

ముంబై: పాముకాటు వల్ల సంభవించే మరణాలు, వైకల్యాలను అరికట్టే దిశగా మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పాముకాటును 'నోటిఫైడ్ వ్యాధి'గా గుర్తిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, వైద్యులు ప్రతి పాముకాటు కేసును (అనుమానిత, నిర్ధారిత) ప్రభుత్వ ఆరోగ్య అధికారులకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలి. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో పాముకాటు ప్రమాదం ఎక్కువగా ఉందని, సకాలంలో వైద్యం అందించడం అత్యంత కీలకమని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ మంత్రి ప్రకాశ్ అబిత్కర్ తెలిపారు.

# ఆందోళనకరంగా ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం

**పాక్ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ హెచ్చరిక**



ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ తెలిపారు. జైల్లో ఉన్న ఇమ్రాన్ వైద్య నివేదికలను పలువురు నిపుణులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ఆయనకు తీవ్ర ఆందోళన, గుండె దడ, అధిక రక్తపోటు ఉన్నట్లు నివేదికల్లో కనిపించిందని వెల్లడించారు. ఇమ్రాన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించి స్వతంత్ర వైద్యుల బృందంతో చికిత్స అందించాలని కోరారు. ఇమ్రాన్ ఖాన్‌కు ప్రస్తుతం గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 54గా ఉందని అల్వీ తెలిపారు. సాధారణంగా ఇది సాధారణ స్థాయిగానే వైద్యులు భావించవచ్చని చెప్పారు. అయితే ఇమ్రాన్‌కు గతంలో విశ్రాంతి సమయంలో గుండె వేగం దీనికంటే తక్కువగా ఉండేదని పేర్కొన్నారు. గుండె దడ కూడా ఉన్నందున వెంటనే 24 గంటల హోల్టర్ మానిటరింగ్ చేయాలని సూచించారు. రక్తపోటును కూడా క్రమం తప్పకుండా పరిశీలించాలని కోరారు. ఇమ్రాన్‌కు ఒత్తిడి తీవ్రంగా పెరిగిందని అల్వీ చెప్పారు. మూడు సంవత్సరాల జైలు జీవితం, ఒంటరిగా ఉంచడం ఆయనపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. రాజకీయ పరిస్థితులు, సహచరుల అరెస్టులు, మరణాలు కూడా ఆయనపై ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొన్నారు. బయట ప్రపంచానికి సంబంధించిన పుస్తకాలు, పత్రికలు, సమాచారానికి అనుమతి పరిమితంగా ఉండటం కూడా సమస్యగా మారిందన్నారు. ఇమ్రాన్‌కు స్ట్రెస్ టెస్ట్, ఎకోకార్డియోగ్రామ్, కార్డియాక్ ఎంఆర్ఐ, సీటీ యాంజియోగ్రామ్ సహా పలు పరీక్షలు చేయించాలని అల్వీ సూచించారు. ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు, న్యాయవాదులను కలిసేందుకు ఏడు నెలలుగా అనుమతి లేదని ఇమ్రాన్ కుమారులు ఇటీవల ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్యంపై ఆందోళనలు మరింత పెరిగాయి. ఇమ్రాన్ ఖాన్ 2018 నుంచి 2022 వరకు పాకిస్థాన్ ప్రధానిగా పనిచేశారు. 2023 నుంచి పలు కేసుల్లో శిక్షలు ఎదుర్కొంటూ జైల్లో ఉన్నారు. తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ కక్షతో పెట్టినవేనని ఆయనతో పాటు ఆయన పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

# విదేశాల్లో మారుతి ఫ్రాంక్స్‌కు ఫుల్ డిమాండ్

**మేక్ ఇన్ ఇండియా సత్తా.. 38 నెలల్లో 2 లక్షల యూనిట్ల ఎగుమతి పూర్తి**




ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ తమ పాపులర్ ఎస్‌యూవీ 'ఫ్రాంక్స్' ఎగుమతుల్లో సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 38 నెలల్లోనే 2 లక్షల యూనిట్ల ఎగుమతి మైలురాయిని దాటినట్లు ప్రకటించింది. భారత్ నుంచి అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ఎస్‌యూవీగా ఫ్రాంక్స్ నిలిచిందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'మేడ్ ఇన్ ఇండియా' ఫ్రాంక్స్ ఎగుమతులు 2023 జూన్ లో ప్రారంభమయ్యాయి. తొలి లక్ష యూనిట్ల ఎగుమతికి 25 నెలల సమయం పట్టగా, ఆ తర్వాత కేవలం 13 నెలల్లోనే మరో లక్ష యూనిట్లను ఎగుమతి చేసి తన వేగాన్ని ప్రదర్శించింది. గుజరాత్‌లోని హన్సల్‌పూర్ ప్లాంట్‌లో తయారవుతున్న ఈ మోడల్‌ను జపాన్ సహా దాదాపు 90 దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా మారుతి సుజుకి ఇండియా ఎండీ, సీఈఓ హిసాషి టేకుచి మాట్లాడుతూ.. "మారుతి సుజుకి ఎగుమతి చేసే ప్రతి వాహనం మా సిబ్బంది కృషికి, భారత తయారీ రంగానికున్న గర్వానికి ప్రతీక. సుమారు 120 దేశాలకు మేము వాహనాలను ఎగుమతి చేస్తున్నాం. కంపెనీ ఎగుమతుల విజయంలో ఫ్రాంక్స్ కీలక పాత్ర పోషించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఇది భారత్‌లో నంబర్ 1 ఎగుమతి అవుతున్న ప్యాసింజర్ వాహనంగా నిలిచింది" అని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్లలో ఫ్రాంక్స్‌కు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ వేగవంతమైన వృద్ధే నిదర్శనమని ఆయన అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' స్ఫూర్తితో భారత తయారీ రంగ పటిమను ప్రపంచానికి చాటుతున్నామని టేకుచి తెలిపారు. వరుసగా ఐదేళ్లుగా ప్యాసింజర్ వాహనాల ఎగుమతుల్లో మారుతి సుజుకి అగ్రస్థానంలో ఉందని, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయిన మొదటి మూడు ప్యాసింజర్ వాహనాలు తమవేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫ్రాంక్స్, జిమ్నీ 5-డోర్, ఇ-విటారా, డిజైర్, బాలెనో మోడళ్లు టాప్ ఎగుమతుల్లో ఉన్నాయి. దేశ ప్యాసింజర్ వాహనాల ఎగుమతుల్లో మారుతి సుజుకి వాటా 55 శాతానికి పైగా ఉండటం విశేషం.

# ప్రమాదంలో భారత మధ్యతరగతి

**భవిష్యత్తులో దేశ ప్రజలకు తీవ్ర సంక్షోభం**

**మిరే అసెట్ సంస్థ సీఈవో సంచలన నివేదిక**


PradeepGaurs/Shutterstock

ముంబై: భారతదేశంలోని మధ్యతరగతి ప్రజలు భవిష్యత్తులో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందంటూ ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ 'మిరే అసెట్ మేనేజ్ మెంట్ మేనేజర్స్' సీఈవో స్వరూప్ మొహంతి హెచ్చరించారు. పెరుగుతున్న వైద్య ఖర్చులు, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు లేకపోవడం వల్ల దేశంలో 'రిటైర్మెంట్ టైమ్ బాంబ్' పేలే పరిస్థితి కనిపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీవిత చరమాంకంలో సరైన ఆర్థిక భద్రత లేకపోతే మధ్యతరగతి కుటుంబాలు కోలుకోలేని దెబ్బతింటాయని ఆయన పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజలు చేసే అతిపెద్ద పొరపాటు తగినంత హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోకపోవడమేనని స్వరూప్ మొహంతి స్పష్టం చేశారు. మారుతున్న కాలంతో పాటు మానవ ఆయుర్దాయం పెరుగుతున్నప్పటికీ, దానికి తగినట్లుగా విశ్రాంతి నిధిని సమకూర్చుకోవడంలో ప్రజలు తీవ్రంగా వెనుకబడుతున్నారని వివరించారు. వయసు పెరిగే కొద్దీ ఆకస్మికంగా వచ్చే వైద్య ఖర్చులు, జీవితకాలం దాచుకున్న పొదుపు మొత్తాన్ని ఒక్కసారిగా కరిగించేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడటానికి కేవలం సంప్రదాయ పద్ధతుల్లో పొదుపు చేయడం లేదా షేర్ మార్కెట్లపై మాత్రమే ఆధారపడటం సరిపోదని ఆయన సూచించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవనశైలి ఖర్చులను తట్టుకోవాలంటే చిన్న వయస్సు నుంచే మ్యూచువల్ ఫండ్స్, బంగారం వంటి విభిన్న సాధనాల్లో క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. సరైన ప్లానింగ్ లేకపోతే రిటైర్మెంట్ జీవితం భారంగా మారుతుందని హెచ్చరించారు.

# ఎలక్ట్రిక్ వాహనాల వయసు.. 20 ఏళ్లు

**ఈవీ, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాల వయసు పెంచే ప్రతిపాదన**

**గరిష్ఠ వయోపరిమితి 17, 20 ఏళ్లకు పెంపు**



న్యూఢిల్లీ: కమర్షియల్ ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. జాతీయ పర్మిట్ పరిధిలో ఉన్న ఈ వాహనాల గరిష్ఠ వయసును మరో ఐదేళ్లు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం జాతీయ పర్మిట్ పరిధిలోని కొన్ని వాణిజ్య వాహనాలకు 12 ఏళ్లు, మరికొన్ని వాహనాలకు 15 ఏళ్ల వయోపరిమితి ఉంది. ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు ఈ పరిమితి వరుసగా 17 ఏళ్లు, 20 ఏళ్లకు పెరగనుంది. అయితే ఈ సడలింపు అన్ని కమర్షియల్ వాహనాలకు వర్తించదు. బ్యాటరీ, హైడ్రోజన్, సహజ వాయువుతో నడిచే వాటికే పరిమితం కానుంది. కాలుష్యాన్ని తగ్గించే వాణిజ్య రవాణాను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. జాతీయ పర్మిట్ ఉన్న వాహన యజమానులకు మరో వెసులుబాటును కూడా కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రతి ఏడాది పర్మిట్ ఆథరైజేషన్ పునరుద్ధరించుకోవాల్సి ఉండగా.. ఇకపై ఒకేసారి ఐదేళ్లకు తీసుకునే అవకాశం కల్పించనుంది. వార్షిక రుసుము రూ.16,500గానే ఉంటుంది. ఐదేళ్లకు మొత్తం రూ.82,500 చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలకు సంబంధించిన పత్రాల ప్రక్రియను కూడా సులభతరం చేయాలని కేంద్రం భావిస్తోంది. వాహన్ డేటాబేస్‌ను ఉపయోగించడం ద్వారా కాగితపు పనిని తగ్గించనుంది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ నిబంధనల్లోనూ మార్పులు ప్రతిపాదించింది. బాడీ అమర్చని చాసిస్‌కు ఆరు నెలల తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఇవ్వనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని ఒక్కోసారి 30 రోజులు చొప్పున పొడిగించే అవకాశం ఉంటుంది. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు, సంబంధిత వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలు కోరారు. నోటిఫికేషన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

# కూటమితోనే 'స్థానికం' పోరు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భాగస్వాములతో కలిసే బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల కీలక సమావేశంలో మాట్లాడిన ఆయన, స్థానిక ఎన్నికల సమన్వయ బాధ్యతలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే వార్డు స్థాయి నుంచి ప్రతి గ్రామంలోనూ కమలం జెండా ఎగిరేలా, స్థానిక పదవులను దక్కించుకునేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి ఫలాలను, మన్ కీ బాత్ వేదికగా వ్యక్తమయ్యే సందేశాలను ప్రతి ఇంటా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే విశాఖ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ... దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధనతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని, ప్రస్తుతం అది లాభాల దిశగా ప్రయాణిస్తోందని పేర్కొన్నారు. పోలవరం నీటిని విశాఖ ప్రాంతానికి అందించే పనులు కూడా వేగవంతమయ్యాయని వివరించారు.

## పోలండ్‌లో గుండెపోటుతో శ్రీకాకుళం వ్యక్తి మృతి

లండన్: ఉపాధి నిమిత్తం పోలండ్ దేశానికి వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించాడు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన బత్సల రాంబాబు (37) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. రాంబాబుకు భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు బిందుశ్రీ (4), చరిష్మ (8 నెలలు) ఉన్నారు. రాంబాబు జీవనోపాధి కోసం 2025 డిసెంబర్‌లో పోలండ్‌కు వెళ్లాడు. అతడు విదేశాలకు వెళ్లే సమయానికి భార్య లావణ్య గర్భవతి. రాంబాబు వెళ్లిన కొద్ది నెలలకే ఆమె రెండో కుమార్తెకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆ చిన్నారి వయసు 8 నెలలు. కన్నబిడ్డను ఒక్కసారి కూడా కళ్లారా చూసుకోకుండానే రాంబాబు కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ హఠాత్పరిణామంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాంబాబు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు సహాయం చేయాలని స్థానిక టీడీపీ నేత శివప్రసాద్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా**

# వర్ల రామయ్య, దళవాయి రమ

అనంతపురం, ఆగస్టు 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# యూట్యూబర్ రావణ్ కేసు

## విజయవాడకు బదిలీ


విజయవాడ, ఆగస్టు 18 (ఈవార్తలు): సోషల్ మీడియా ద్వారా విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన యూట్యూబర్ రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్ పై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కింద కేసు నమోదైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు జైల్లో రిమాండ్ లో ఉన్నాడు. తాజాగా అతడి కేసును గన్నవరం కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించి నమోదైన ఉపా చట్టం తీవ్రత, ప్రత్యేక న్యాయ పరిమితులను పరిగణనలోకి తీసుకుని, కేసు రికార్డులను గన్నవరం కోర్టు నుంచి విజయవాడలోని 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు, అలాగే ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు అధికారులు బదిలీ చేశారు. ఉపా చట్టం కిందికి వచ్చే కేసులకు ప్రత్యేక అధికార పరిధి కలిగిన న్యాయస్థానాల్లోనే విచారణ జరగాల్సి ఉండటంతో ఈ మార్పులు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడి డిజిటల్ కంటెంట్, నిషేధిత సిద్ధాంతాల ప్రచారం, నెట్‌వర్క్‌లపై సమగ్రంగా విచారించాల్సి ఉందంటూ పోలీసులు కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయగా, విజయవాడ కోర్టులో న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం, పోలీసు కస్టడీ పిటిషన్‌పై తదుపరి విచారణతో పాటు తీర్పు వెల్లడించేందుకు తేదీని ఖరారు చేసింది.

లయ్యారి చిత్రం


కోమిక అంచాల్

## ఎల్లుండి జైలర్ 2
# 'ఫస్ట్ సింగిల్'

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' నుంచి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ది ఫీస్ట్ ఈజ్ రెడీ అంటూ చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ఈ ఫస్ట్ సింగిల్ ఈ నెల 21వ తేదీన విడుదల కానున్నట్లు చిత్రబృందం తెలిపింది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. మొదటి భాగం మ్యూజిక్‌తో ఏ విధంగా థియేటర్లను షేక్ చేసిందో, ఇప్పుడు ఈ సీక్వెల్ సాంగ్ తో కూడా అదే రేంజ్ మ్యాజిక్ రిపీట్ చేయడానికి అనిరుధ్ సిద్ధమవుతున్నారు. మరోవైపు ఈ సినిమాను అక్టోబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, నిర్మల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




# నాగిన్.. వెండితెరవైపు అడుగులు!



భారతీయ టెలివిజన్ రంగంలో దశాబ్దం పాటు తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించిన అత్యంత ప్రజాదరణ పొందిన సూపర్ నేచురల్ ఫ్రాంచైజీ -నాగిన్- ఇప్పుడు సరికొత్త రూపం సంతరించుకోనుంది. నిర్మాత ఏక్తా కపూర్ ఈ అద్భుతమైన ఫాంటసీ ప్రపంచాన్ని బుల్లితెరకే పరిమితం చేయకుండా ఏకంగా వెండితెరకు తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2015లో ప్రారంభమైన ధారావాహిక దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుందో చెప్పాల్సిన పనిలేదు. వివిధ సీజన్లలో మౌనీ రాయ్, అదా ఖాన్, తేజస్వి ప్రకాశ్ వంటి ఎంతోమంది ప్రముఖ నటీమణులు నటించి బ్రాండ్‌కు తిరుగులేని క్రేజ్ తెచ్చారు. ఇదే క్రేజ్‌ను బిగ్ స్క్రీన్‌పై భారీ విజువల్స్ తో ఆవిష్కరించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. టెలివిజన్ ప్రేక్షకులకు అసాధారణమైన అనుభూతిని పంచిన కథని సినిమాలుగా మలచడం ద్వారా మరింత పెద్ద ఎత్తున ప్రేక్షకులకు చేరువ చేయొచ్చని బాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# సోనాక్షిపై ట్రోలింగ్ వెనుక బీజేపీ

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హాపై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్ అంశంపై ఆమె తండ్రి, ప్రముఖ నటుడు-రాజకీయ నాయకుడు శత్రుఘ్న సిన్హా సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన కూతురిపై వస్తున్న ఆన్‌లైన్ దాడి పూర్తిగా ఆర్గానిక్ కాదని, దీని వెనుక భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ హస్తం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో సోనాక్షిని టార్గెట్ చేస్తున్నవారు చాలామంది పెయిడ్ ట్రోలర్స్ అని, వారు మాట్లాడుతున్న విషయాలపై కనీస అవగాహన కూడా ఉండదని ఆయన విమర్శించారు. జార్ఖండ్‌లో ఇటీవల జరిగిన విద్యార్థి ఉద్యమాల సమయంలో సోనాక్షి స్పందించలేదంటూ కొందరు ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే. అయితే, జార్ఖండ్ పిల్లల కోసం సోనాక్షి చాలా బలంగా తన మద్దతును తెలిపిందని శత్రుఘ్న సిన్హా స్పష్టం చేశారు. ఈ ట్రోలింగ్‌ను సోనాక్షి పెద్దగా పట్టించుకోవడం లేదని, తన జీవితంలో ఇతర ముఖ్యమైన విషయాలపై దృష్టి పెడుతుందని ఆయన తెలిపారు. గతంలోనూ పలు సామాజిక, రాజకీయ అంశాలపై సోనాక్షి గళం విప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే, ఆమె భవిష్యత్తులో రాజకీయాల్లోకి వస్తారా లేదా అనే దానిపై స్పష్టతనిస్తూ.. తాను ఈ విషయంపై ముందైతే అడిగేవాడినని, ప్రస్తుతం ఆమె స్వయంశక్తితో ఎదిగిన సమర్థురాలైన కుమార్తె అని శత్రుఘ్న సిన్హా ప్రశంసించారు.



# తమన్నా గ్లామర్‌లెస్ పాట్లు!



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ల లిస్ట్ లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న తమన్నా ఇప్పుడు కెరీర్‌లో మరో కీలక దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాలుగా హీరోయిన్‌గా కొనసాగుతున్న ఆమె కెరీర్‌లో గ్లామర్, కమర్షియల్ సినిమాలు, స్పెషల్ సాంగ్స్ ఒకవైపు గుర్తింపును తీసుకొస్తే.. మరోవైపు అదే ఇమేజ్ ఇప్పుడు కొత్త తరహా పాత్రలకు అడ్డంకిగా మారుతోందా అనే డిస్కషన్ మొదలైంది. ఈ నేపథ్యంలో తనకు వచ్చే పాత్రల విషయంలో తమన్నా ఆలోచనా విధానం మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇండస్ట్రీలోకి వచ్చిన తొలినాళ్లలో తమన్నా కొన్ని పర్సనల్ లిమిట్స్ ను చాలా క్లియర్ గా ఫాలో అయ్యారు. ముఖ్యంగా కిస్ సీన్స్ కు దూరంగా ఉండే హీరోయిన్‌గా ఆమెకు ప్రత్యేకమైన ఇమేజ్ ఏర్పడింది. అయితే కాలక్రమంలో సినిమాల స్వభావం, కథ చెప్పే విధానం మారడంతో ఆమె కూడా తన డెసిషన్స్ లో మార్పులు చేసుకున్నారు. లస్ట్ స్టోరీస్ వంటి ప్రాజెక్ట్ ద్వారా తెరపై మరింత బోల్డ్‌గా కనిపించేందుకు సిద్ధమైన తమన్నా..



# మహిళలకు పర్ఫెక్ట్‌గా చూపొద్దు

సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు అనగానే అందంగా, పద్ధతిగా, ఎలాంటి తప్పులు చేయని పర్ఫెక్ట్ అమ్మాయిలుగా చూపించడం పాత పద్ధతి. అయితే దీనిపై నటి తాప్సీ పన్ను తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. 14వ జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మాట్లాడిన ఆమె, సినిమాల్లో స్త్రీ పాత్రల రూపకల్పనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహిళలను ఎప్పుడూ పర్ఫెక్ట్‌గా కాకుండా, తప్పులు చేసే సాధారణ మనుషులుగా చూపించినప్పుడే ఆ క్యారెక్టర్లు రియలిస్టిక్‌గా ఉంటాయని టాప్సీ అభిప్రాయపడ్డారు. స్క్రీన్ పై స్త్రీలను ఎప్పుడూ ఒకేలా, ఆదర్శవంతంగా చూపించాల్సిన పనిలేదని తాప్సీ అన్నారు. మహిళలకు కూడా సొంత ఆశయాలు ఉంటాయి, వారు కూడా జీవితంలో పొరపాట్లు చేస్తారు. కాబట్టి వారి పాత్రల్లో అనేక రకాల షేడ్స్, సంక్లిష్టతలు ఉన్నప్పుడే కథలో ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ఇక ఆడవారిని పర్ఫెక్ట్‌గా చూపించాలనే ప్రెషర్ నుంచి బయటకు వచ్చి, వారిని కూడా తప్పులు చేసే సాధారణ మనుషులుగా చూపించాలని స్పష్టం చేశారు.

# సారీ చెప్పిన అవికా గోర్

ప్రముఖ రియాలిటీ షో ఖత్రోన్ కే ఖిలాడి సీజన్ 15 షూటింగ్ సెట్స్‌లో ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. షోలో పాల్గొన్న నటి అవికా గోర్ తోటి కంటెస్టెంట్ ఫర్హానా భట్ తో జరిగిన వివాదంపై బహిరంగంగా క్షమాపణలు కోరడం టెలివిజన్ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. షో సమయంలో ఇద్దరి మధ్య జరిగిన తీవ్ర వాగ్వాదం సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. అయితే పరిస్థితి తీవ్రతను గ్రహించిన అవికా గోర్ వెంటనే తప్పును తెలుసుకుని క్షమాపణ చెప్పడం అందరినీ ఆశ్చర్యపరిచింది. షో నిర్వహణలో భాగంగా కంటెస్టెంట్లు ఎదుర్కొనే మానసిక ..శారీరక ఒత్తిళ్లు కొన్నిసార్లు ఇలాంటి ఘర్షణలకు దారి తీస్తుంటాయి. టాస్కుల సమయంలో గెలుపు ఓటముల ఒత్తిడి, మానసిక ఆందోళన కారణంగా తోటి కంటెస్టెంట్లతో మాటల యుద్ధాలు జరగడం రియాలిటీ షోలలో సర్వసాధారణం. -ఖత్రోన్ కే ఖిలాడి 15- సెట్స్‌లో కూడా అదే జరిగిందని.. ఆ సమయంలో తాను తీవ్రమైన అసహనానికి, మానసిక ఆందోళనకు గురయ్యానని అవికా గోర్ వెల్లడించారు. తన కోపాన్ని అదుపు చేసుకోలేక పోవడం వల్లనే ఆ వివాదం పెద్దదైందని అవిక నిజాయితీగా అంగీకరించారు.





# 100 సిక్సర్ల వీరుడు.. పంత్

**తొలి భారత టెస్టు క్రికెటర్‌గా రికార్డు**
**ప్రపంచంలో నాలుగో బ్యాటర్**

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలెలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. లహిరు కుమార బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టి పంత్ ఈ మైలురాయిని అందుకున్నాడు. పంత్ తనదైన ఆటతో ఈ రికార్డును సాధించాడు. కుమార వేసిన బంతిని ముందుకు వచ్చి లెగ్ సైడ్ వైపు భారీ షాట్ ఆడాడు. బంతి నేరుగా బౌండరీ దాటి సిక్సర్‌గా వెళ్లింది. దీంతో పంత్ టెస్టు కెరీర్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. అదే సమయంలో టెస్టుల్లో తన 20వ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. ఈ ఘనతతో పంత్ ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అరుదైన జాబితాలో చేరాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ 138 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 107 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. పంత్ 100 సిక్సర్లతో మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా 100 సిక్సర్లు బాదాడు. టెస్టుల్లో పంత్ సిక్సర్ల వేగం కూడా ప్రత్యేకంగా నిలిచింది. అతడు 100 సిక్సర్లను 49.2 బంతులకు ఒకటి చొప్పున సాధించాడు. ఈ విషయంలోనూ పంత్ దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఏ భారత బ్యాటర్ కూడా టెస్టుల్లో 100 సిక్సర్ల మార్క్‌ను అందుకోలేదు. దీంతో పంత్ పేరు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.



# భారత్‌వైపు గాలే!

**విజయం దిశగా టీమిండియా.. 372 పరుగుల లక్ష్య ఛేదనలో 84/4తో శ్రీలంక తడబాటు**
**విజయానికి 6 వికెట్ల దూరంలో భారత్.. లంకకు ఇంకా 288 పరుగులు అవసరం**

**గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై భారత్ పూర్తి పట్టు సాధించింది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి కష్టాల్లో పడింది.**

విజయానికి టీమిండియా కేవలం 6 వికెట్ల దూరంలో నిలవగా, లంక గెలవాలంటే చివరి రోజు ఇంకా 288 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నాలుగో రోజు ఆటలో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది.



భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బౌలింగ్ ప్రారంభించిన భారత్‌కు పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతమైన శుభారంభం అందించారు. సిరాజ్ తన బౌన్సర్‌తో నిషాన్ మదుష్క (6)ను ఔట్ చేసి తొలి వికెట్ అందించగా, ఆ తర్వాతి ఓవర్లోనే మానవ్ సుతార్.. దినేష్ చండీమాల్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పసిందు సూరియబండార (0)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కొద్దిసేపటికే ప్రసిద్ధ్ కృష్ణ.. కమిందు మెండిస్ (2)ను కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయడంతో శ్రీలంక 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో లహిరు ఉడార (16), కెప్టెన్ ధనంజయ డిసిల్వా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే, మరోసారి బౌలింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ ఈ జోడీని విడదీసి తన రెండో వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సోనాల్ దినుష (25 నాటౌట్)తో కలిసి ధనంజయ డిసిల్వా (31 నాటౌట్) పోరాడటంతో నాలుగో రోజు మరో వికెట్ పడకుండా లంక ముగించగలిగింది. వీరిద్దరూ అజేయంగా ఐదో వికెట్‌కు 37 పరుగులు జోడించారు. వెలుతురు మందగించడంతో అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేశారు. అంతకుముందు, నాలుగో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషబ్ పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 69 బంతుల్లో 66 పరుగులు చేశాడు. దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కూడా రాణించి జట్టుకు విలువైన పరుగులు అందించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్.. శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. లంక బౌలర్లలో అసింత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు పడగొట్టారు.

# పంత్‌తో మనోళ్లకూ ఇబ్బందే: రహానే





వికెట్ల వెనుక రిషభ్ పంత్ చేసే సందడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బంతి బంతికీ ఏదో ఒక మాటతో బ్యాటర్‌ను రెచ్చగొట్టడం, బౌలర్లను ఉత్సాహపరచడం ఆయనకు అలవాటు. శ్రీలంకతో తొలి టెస్టులోనూ పంత్ ఇదే తరహాలో సందడి చేశాడు. అయితే ఆయన మాటలు కొన్నిసార్లు ప్రత్యర్థి బ్యాటర్‌ను కాకుండా సొంత జట్టు బౌలర్లనే ఇబ్బంది పెడతాయని మాజీ క్రికెటర్ అజింక్య రహానే చెప్పాడు. పంత్ ఎప్పుడూ ఇలాగే ఉంటారని రహానే అన్నాడు. అతడు చాలా సరదాగా ఉంటారని చెప్పాడు. అయితే శ్రీలంక ఆటగాళ్లకు హిందీ అర్థం కాకపోవడంతో పంత్ మాటలతో బ్యాటర్ ఏకాగ్రత కోల్పోయే అవకాశం ఉందన్నాడు. అదే సమయంలో స్లిప్స్, షార్ట్ లెగ్‌లో ఉన్న ఫీల్డర్లు మాత్రం బంతిపై పూర్తిగా దృష్టి పెట్టాలని చెప్పాడు. క్యాచ్ వచ్చే సమయంలో పంత్ మాటలతో ఫీల్డర్ దృష్టి మళ్లితే బౌలర్లు కోపం తెచ్చుకునేవారని రహానే వెల్లడించాడు. తాను భారత జట్టులో ఉన్న సమయంలో అశ్విన్, జడేజా లాంటి బౌలర్లు పంత్ మాటలతో ఇబ్బంది పడేవారని రహానే గుర్తు చేసుకున్నాడు. బ్యాటర్‌ను డిస్టర్బ్ చేయాలి కానీ.. సొంత ఆటగాళ్లను కాదని పంత్‌కు చెప్పాల్సి వచ్చేదని తెలిపాడు. శ్రీలంకతో టెస్టులో పంత్ మరోసారి తన చమత్కారంతో నవ్వులు పూయించాడు. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి స్టంప్ మైక్‌లో వినిపించిన సంభాషణ ఆసక్తికరంగా మారింది. జడేజా ఇంకా బౌలింగ్‌కు రాకపోవడంతో సర్ఫరాజ్.. 'లాంగ్ గేమ్.. అందరం కలిసి వికెట్లు పంచుకుందాం' అన్నాడు.



# అంపైర్ గూబ పగిలింది


ఢిల్లీ ప్రీమియర్ లీగ్(డీపీఎల్) 2026 సీజన్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. ఓ బ్యాటర్ కొట్టిన షాట్‌కు అంపైర్ గూబ పగిలింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. అంపైర్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. న్యూఢిల్లీ టైగర్స్, ఈస్ట్ ఢిల్లీ మధ్య సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. న్యూఢిల్లీ టైగర్స్ ఇన్నింగ్స్‌లో 18వ ఓవర్‌లో ఆ జట్టు బ్యాటర్ లక్ష్య తరేజా పవర్‌ఫుల్ స్ట్రైట్ డ్రైవ్ ఆడగా.. బంతి కాస్త ప్రధాన అంపైర్ ధర్మేష్ భరద్వాజ్ చెవి భాగంలో బలంగా తాకింది. ఈ షాట్ ఆడగానే అంపైర్ అప్రమత్తమై కిందికి వంగినా తప్పించుకోలేకపోయాడు. వెంటనే అంపైర్‌ను ఫిజియోలు పరీక్షించి మైదానం బయటకు పంపించారు. ప్రస్తుతం అతనికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అంపైర్ భరద్వాజ్‌కు మైదానంలో బంతి తాకడం ఇదే తొలిసారి కాదు. డీపీఎల్ 2026 సీజన్ ఆరంభంలో మరో బ్యాటర్ ఆడిన స్ట్రైట్ డ్రైవ్ అతని భుజానికి బలంగా తాకింది. కానీ ఆ సమయంలో పెద్ద గాయం కాలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేసింది. మయాంక్ రావత్(40), సూర్యన్ష్ రైనా(33), అర్పిత్ రాణా(33), వాన్ష్ మెహ్రా(35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. అనంతరం న్యూఢిల్లీ టైగర్స్ 19.2 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌటై 36 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. హిమ్మత్ సింగ్(31), వైభవ్ రావల్(28) టాప్ స్కోరర్లుగా నిలిచారు. అంపైర్‌ను గాయపర్చిన లక్ష్య తరేజా 25 బంతుల్లో ఫోర్‌తో 21 పరుగులే చేశాడు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు పాపం అంపైర్ అని సానుభూతి చూపిస్తున్నారు.



# మహిళలు భళా

**హాకీ వరల్డ్ కప్‌లో సౌతాఫ్రికాపై గెలుపు చిత్తు చేసిన భారత్**

హాకీ వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల హాకీ జట్టు భారీ విజయం సాధించింది. మంగళవారం జరిగిన రెండో గ్రూపు మ్యాచ్‌లో భారత్ 6-1 తేడాతో సౌతాఫ్రికాను మట్టికరిపించింది. తొలి మ్యాచ్‌ను చైనాతో డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. సౌతాఫ్రికాపై మాత్రం దూకుడుగా ఆడింది. ఆరంభం నుంచే ఎటాకింగ్‌కు దిగింది. 11వ నిమిషంలో సునెలిటా టొప్పో ఇండియాకు తొలి గోల్ అందించింది. ఆ తరర్వాత నవ్‌నీత్ కౌర్ 17వ నిమిషంలో, సుశీల 25వ నిమిషంలో చెరో గోల్ చేయడంతో ఫస్టాఫ్‌లో భారత్ 3-0తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత కూడా భారత్ జోరు కొనసాగింది. 38వ నిమిషంలో దీపిక, 44వ నిమిషంలో లాల్‌రెమ్సియామి, 45వ నిమిషంలో సాక్షి గోల్స్ చేశారు. దీంతో భారత్ 6-0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. ఆరంభం నుంచి ఇండియా దూకుడు కొనసాగగా.. సౌతాఫ్రికా కళ్లెం వేయలేకపోయింది. మరోవైపు, దక్షిణాఫ్రికా



అవకాశాలను భారత డిఫెన్స్ తిప్పికొట్టింది. దీంతో ఆ జట్టు ఒక్క గోల్ చేయడం మినహా ఏం చేయలేకపోయింది. 55వ నిమిషంలో సౌతాఫ్రికా ఏకైక, చివరి గోల్ నమోదు చేసింది. ఈ విజయంతో భారత జట్టు రెండో రౌండ్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. ప్రస్తుతం గ్రూపు-డీలో 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. శుక్రవారం చివరి గ్రూపు మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 19-8-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# కార్మికుల డబ్బు కాజేశారా?

కార్మికుడి జీతం నుంచి కట్ చేసిన ప్రతి రూపాయి అతని భవిష్యత్తుకు భరోసా. ఆ డబ్బే ఉద్యోగ విరమణ తర్వాత ఆసరా. అనారోగ్యం, కుటుంబ అవసరాలు, పిల్లల చదువు, వృద్ధాప్యం.. జీవితంలోని ఎన్నో కీలక సందర్భాల్లో పీఎఫ్ సొమ్ము ఒక కార్మికుడికి ఆర్థిక రక్షణగా నిలుస్తుంది. అలాంటి కార్మికుల భవిష్యత్తు నిధుల విషయంలో తెలంగాణలో రూ. 1,100 కోట్లకు పైగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయన్న వార్తలు కలవరపెడుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక అవకతవకల వ్యవహారం కాదు. లక్షలాది మంది కార్మికుల చెమటోడ్చి సంపాదించిన డబ్బుకు సంబంధించిన ప్రశ్న. తెలంగాణ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులపై ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో అనేక అసమానతలు బయటపడినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఆధార్ ఆధారిత పరిశీలనలో పీఎఫ్ ఖాతాలు లేని ఉద్యోగులు, జమలు కనిపించని ఖాతాలు, అసలు ఉనికిలో లేని 'దెయ్యం ఉద్యోగులు' ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఔట్‌సోర్సింగ్ సంస్థలు ఉద్యోగుల జీతాల నుంచి పీఎఫ్ వాటాను మినహాయించడమే కాదు.. యజమాని వాటాను కూడా సంబంధిత సంస్థలకు జమ చేయాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వం ఆ ఖర్చులను భరిస్తున్నప్పుడు, కార్మికుడి వాటా కూడా మినహాయించబడుతున్నప్పుడు, ఆ మొత్తం సకాలంలో పీఎఫ్ ఖాతాలోకి వెళ్లిందా లేదా అనేది పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది? ఇక్కడే ప్రభుత్వ యంత్రాంగం జవాబుదారీతనం ప్రశ్నార్థకమవుతోంది. ప్రైవేటు ఔట్‌సోర్సింగ్ సంస్థలు తప్పు చేసి ఉంటే వాటిపై చట్టపరమైన చర్యలు తప్పవు. కానీ ఏళ్ల తరబడి ఆ వ్యవహారం కొనసాగితే పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేసింది? ప్రతి నెలా పీఎఫ్ చలాన్లు, ఎలక్ట్రానిక్ రిటర్నులు సమర్పించాల్సి ఉండగా వాటిని ఎవరు పరిశీలించారు? ప్రభుత్వ విభాగాలు ఉద్యోగుల సంఖ్యను, జీతాల చెల్లింపులను, పీఎఫ్ జమలను ఎందుకు సరిపోల్చలేదు? ఇవన్నీ సమాధానం కోరుతున్న ప్రశ్నలు. ఈ వ్యవహారంలో ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం బయటకు వచ్చినవి ఆడిట్, ప్రాథమిక విచారణల్లో గుర్తించిన ఆరోపణలు, అక్రమాల అనుమానాలు. పూర్తి స్థాయి దర్యాప్తు, బాధ్యుల నిర్ధారణ, నిధుల లెక్కలు తేలిన తర్వాతే తుది బాధ్యతను నిర్ణయించాలి. కానీ అదే సమయంలో 'విచారణ జరుగుతోంది' అంటూ సంవత్సరాల తరబడి ఆలస్యం చేయడం కూడా ఆమోదయోగ్యం కాదు.

# కల్యాణలక్ష్మి.. పేదల హక్కా?




పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే ఆ కుటుంబానికి ఆనందంతో పాటు ఆర్థిక భారం కూడా. ఆ భారాన్ని కొంతైనా తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు లక్షలాది కుటుంబాలకు ఆర్థిక అండగా నిలిచాయి. అయితే కాలం మారుతున్న కొద్దీ ఈ పథకాల చుట్టూ రాజకీయ వివాదాలు కూడా పెరుగుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ ఒక మాట.. ప్రతిపక్షం మరో మాట. మధ్యలో మాత్రం లబ్ధిదారుల ఎదురుచూపులు. ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే.. కల్యాణలక్ష్మి రాజకీయ పథకమా? లేక పేద కుటుంబానికి ప్రభుత్వ హక్కుగా అందాల్సిన సంక్షేమ సహాయమా? సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన సమయం ఇది. ఒక ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించింది కాబట్టి, తర్వాత వచ్చిన ప్రభుత్వం దానిని రాజకీయ వారసత్వంగా చూడాల్సిన అవసరం లేదు. అదే సమయంలో, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్న కారణంతో పేదలకు ఉపయోగపడుతున్న పథకాన్ని నిలిపివేయడం కూడా సమర్థనీయం కాదు. ప్రజల కోసం రూపొందించిన పథకాలు ప్రభుత్వాలవి కావు.. ప్రజలవి. కల్యాణలక్ష్మి విషయంలో కూడా ఇదే సూత్రం వర్తించాలి. పెళ్లి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బంగారం, దుస్తులు, భోజనం, వేదిక, ఇతర ఏర్పాట్లు.. పేద కుటుంబానికి ఒక్క పెళ్లి ఆర్థికంగా పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యంగా రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలు, చిన్న రైతులు, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ఈ భారం మరింత ఎక్కువ. అలాంటి సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వారికి ఉపశమనమే. కానీ సంక్షేమ పథకాన్ని కేవలం ఎన్నికల రాజకీయానికి పరిమితం చేయడం ప్రమాదకరం. ఎన్నికల ముందు హామీలు.. ఎన్నికల తర్వాత ఆలస్యాలు.. ఆపై రాజకీయ ఆరోపణలు.. ఈ చక్రం నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. అర్హత ఉన్న కుటుంబానికి సహాయం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంటే, ఆ పథకం ఉద్దేశమే దెబ్బతింటుంది. దరఖాస్తు చేసుకున్న తర్వాత నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తే, పేద కుటుంబం అప్పు చేయాల్సి వస్తుంది. అప్పు చేసి పెళ్లి నిర్వహించిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే సాయం వస్తే దాని ప్రయోజనం ఎంత? అందుకే ప్రభుత్వం ముందుగా బకాయిలు, దరఖాస్తులు, అర్హతలు, చెల్లింపుల స్థితిపై స్పష్టమైన గణాంకాలను ప్రజల ముందుంచాలి. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? ఎంతమందికి మంజూరు అయింది? ఎంతమందికి చెల్లింపులు జరిగాయి? ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి? ఈ వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉండాలి. ఇంకో ముఖ్యమైన విషయం.. అర్హత లేని వారికి పథకం అందకూడదు. ప్రభుత్వ నిధులు ప్రజల పన్నుల నుంచి వస్తాయి. కాబట్టి లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, మధ్యవర్తిత్వం, అవినీతి, తప్పుడు ధ్రువపత్రాలకు తావుండకూడదు. అదే సమయంలో నిజంగా అర్హులైన పేదలను చిన్నచిన్న సాంకేతిక కారణాలతో తిరస్కరించకూడదు. సంక్షేమ పథకాలకు రాజకీయ రంగు పులమడం మన రాజకీయ సంస్కృతిలో కొత్తేమీ కాదు. ఒక పార్టీ పథకం ప్రారంభిస్తే మరో పార్టీ దానిని విమర్శిస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పథకానికి పేరు మార్చుతుంది లేదా కొత్త నిబంధనలు తీసుకొస్తుంది. చివరికి రాజకీయ నాయకులు తమ విజయాలను ప్రచారం చేసుకుంటారు. కానీ లబ్ధిదారుడు మాత్రం "నా డబ్బు ఎప్పుడు వస్తుంది?" అని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉంటాడు. ఇది మారాలి. కల్యాణలక్ష్మిని కొనసాగించాలా? మార్చాలా? విస్తరించాలా? ఆదాయ పరిమితులను సవరించాలా? అన్నదానిపై ప్రభుత్వం నిపుణులతో చర్చించవచ్చు. ఆర్థిక పరిస్థితులను బట్టి విధానపరమైన మార్పులు చేయవచ్చు. కానీ ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనుక పేద కుటుంబ ప్రయోజనం ఉండాలి.. రాజకీయ ప్రయోజనం కాదు. అదే సమయంలో ప్రతిపక్షాల బాధ్యత కూడా ఉంది. ప్రభుత్వం పథకాన్ని అమలు చేయడంలో విఫలమైతే ప్రశ్నించాలి. బకాయిలుంటే నిలదీయాలి. అర్హులకు సాయం అందకపోతే పోరాడాలి. కానీ ప్రతి సమస్యను రాజకీయ ప్రచారంగా మార్చడం వల్ల పేదల సమస్య పరిష్కారం కాదు. కల్యాణలక్ష్మి పేరుతో ఓటు అడగడం ఎంత తప్పో.. కల్యాణలక్ష్మి పేరుతో పేదల ఆవేదనను రాజకీయంగా ఉపయోగించుకోవడం కూడా అంతే తప్పు. తెలంగాణలో సంక్షేమం రాజకీయ పోటీకి కేంద్రంగా కాకుండా సామాజిక భద్రతకు పునాదిగా మారాలి. ఒక పేద తండ్రి తన కుమార్తె పెళ్లి గురించి ఆలోచించినప్పుడు ప్రభుత్వం తనకు అండగా ఉంటుందన్న నమ్మకం కలగాలి. ఆ నమ్మకానికి పార్టీ రంగు ఉండకూడదు. కల్యాణలక్ష్మి ఒక ప్రభుత్వ పథకం మాత్రమే కాదు.. పేద కుటుంబానికి ఒక భరోసా. అందుకే ఎవరు ప్రారంభించారు? ఎవరు కొనసాగిస్తున్నారు? ఎవరి హయాంలో ఎంత ఇచ్చారు? అనే రాజకీయ లెక్కల కంటే.. ఎంతమంది పేదలకు చేరింది? ఎంత వేగంగా చేరింది? ఎంత పారదర్శకంగా చేరింది? అన్నదే అసలు ప్రశ్న. పథకాలు ఓట్ల కోసం కాదు.. ప్రజల కోసం ఉండాలి. సంక్షేమం రాజకీయ ఆయుధం కాదు.. సామాజిక బాధ్యత. కల్యాణలక్ష్మిని రాజకీయ కళ్లద్దాలతో చూస్తే అది ఒక పథకమే కనిపిస్తుంది. పేద కుటుంబం కళ్లతో చూస్తే మాత్రం.. అది ఒక ఆడబిడ్డ భవిష్యత్తుకు ప్రభుత్వ భరోసా.

**- రాజమహేందర్ రెడ్డి, వరంగల్**



భూమి అంటే కేవలం మట్టి కాదు.. అది మనిషి భవిష్యత్తు. తాతల నుంచి వారసత్వంగా వచ్చినా, చెమటోడ్చి సంపాదించినా, ప్రభుత్వం కేటాయించినా.. భూమి ప్రతి కుటుంబానికి ఒక భరోసా. అలాంటి భూముల విషయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం అత్యంత పారదర్శకంగా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి. కానీ తెలంగాణలో భూముల వ్యవహారం రోజురోజుకూ రాజకీయ ఆరోపణలకు, అధికార దూకుడుకు, సామాన్యుడి ఆందోళనకు కేంద్రంగా మారుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని చెబుతోంది.

# భూముల భక్షణ

చెరువులు, ప్రభుత్వ భూములు, ఆక్రమిత స్థలాలను కాపాడుతామని ప్రకటిస్తోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ ఆస్తులను రక్షించడం నిస్సందేహంగా ప్రభుత్వ బాధ్యతే. కానీ ఆ చర్యలే ప్రజల్లో అనుమానాలకు తావిస్తే? చట్టాన్ని అమలు చేసే పేరుతో నిజమైన హక్కుదారుల భూములపైనా అనిశ్చితి ఏర్పడితే? అప్పుడు ప్రశ్నలు తలెత్తడం సహజం. భూముల విషయంలో ప్రభుత్వం అనుసరించే విధానం కత్తి మీద సాములాంటిది. ఒకవైపు ప్రభుత్వ భూములను కాపాడాలి. మరోవైపు దశాబ్దాలుగా రికార్డుల్లో ఉన్న పట్టాదారుల హక్కులను పరిరక్షించాలి. చెరువుల పరిరక్షణ పేరుతో నిజమైన పట్టాదారుల భూములు ప్రభావితమైతే, అభివృద్ధి పేరుతో పేదల స్థలాలు కోల్పోతే, భూ ప్రక్షాళన పేరుతో రికార్డుల్లో గందరగోళం సృష్టిస్తే.. అది ప్రజాస్వామ్య పరిపాలనకు మచ్చ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూముల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తున్నదన్నది స్పష్టమే. అయితే కఠినత్వం కంటే న్యాయం ముఖ్యం. అధికారులు నోటీసులు ఇచ్చారా? బాధితులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించారా? భూమి వాస్తవంగా ప్రభుత్వానిదా, చెరువు పరిధిలోనిదా, లేక వ్యక్తిగత పట్టా భూమా అనే అంశాన్ని స్వతంత్రంగా నిర్ధారించారా? రికార్డులు, క్షేత్రస్థాయి సర్వే, ఉపగ్రహ చిత్రాలు, పాత పత్రాలు అన్నింటినీ పరిశీలించారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. ఇదే సమయంలో మరో ప్రమాదకరమైన ధోరణి కూడా కనిపిస్తోంది. భూమి రాజకీయ ఆయుధంగా మారకూడదు. అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి ఒక న్యాయం, వ్యతిరేకంగా ఉన్నవారికి మరో న్యాయం జరిగితే భూ పరిపాలనపై ప్రజల నమ్మకం పూర్తిగా దెబ్బతింటుంది. ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అది చట్టపరమైన ప్రక్రియగా కనిపించాలి.. రాజకీయ ప్రతీకారంగా కాదు. ప్రభుత్వ భూములను కాపాడటంలో వెనుకడుగు వేయాల్సిన అవసరం లేదు. చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలను తొలగించాలి. భూ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి. కానీ అదే సమయంలో చట్టబద్ధమైన పత్రాలతో భూమిని కలిగి ఉన్న సామాన్యుడిని భయపెట్టే పరిస్థితి ఉండకూడదు. ఇక్కడే ప్రభుత్వానికి అసలు పరీక్ష. భూమి విషయంలో తప్పు జరిగితే దాని ప్రభావం ఒక్క వ్యక్తిపై ఉండదు. ఒక కుటుంబం ఆస్తి పోతుంది. పిల్లల చదువు, వివాహం, భవిష్యత్తు కోసం పెట్టుకున్న పొదుపు కరిగిపోతుంది. జీవితకాల సంపాదన ఒక్క నిర్ణయంతో ప్రశ్నార్థకమవుతుంది. అందుకే భూ వ్యవహారాల్లో ప్రభుత్వ చర్యలకు అత్యున్నత ప్రమాణాల పారదర్శకత అవసరం. 'భూములు భక్షిస్తున్న ప్రభుత్వం' అనే ఆరోపణ నిజమో కాదో ప్రజలే నిర్ణయిస్తారు. కానీ అలాంటి ఆరోపణలకు అవకాశం లేకుండా చేయాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిజంగా భూములను కాపాడాలనుకుంటే ముందుగా భూ రికార్డులను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలి. ప్రతి భూమికి స్పష్టమైన హక్కు, స్పష్టమైన సరిహద్దు, స్పష్టమైన రికార్డు ఉండేలా చూడాలి. వివాదాస్పద భూములపై ప్రత్యేక విచారణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. బాధితులకు అప్పీల్ అవకాశం కల్పించాలి. అధికారుల నిర్ణయాలకు బాధ్యత నిర్ధారించాలి. ప్రభుత్వ భూమిని కాపాడటం ఎంత ముఖ్యమో, ప్రజల హక్కులను కాపాడటం అంతకంటే ముఖ్యమైనది. చెరువును కాపాడే పేరుతో రైతు కన్నీరు పెట్టకూడదు. ఆక్రమణ తొలగించే పేరుతో నిజమైన పట్టాదారు రోడ్డున పడకూడదు. అభివృద్ధి పేరుతో మధ్యతరగతి జీవితకాల పొదుపు మట్టిలో కలవకూడదు.




**నవీన్ పోగుల**
బీఆర్ఎస్ సీనియర్ నేత

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.